




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 144 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | గురువారం 29 జనవరి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :144 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | THU 29 JANUARY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## విశాఖకు ఏఐజీ ఆసుపత్రి..

### పరిశ్రమలకు భూ కేటాయింపులకు మంత్రిమండలి ఆమోదం



- పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు అదనపు నిధులు మంజూరు
- విశాఖలో ఏఐజీ ఆసుపత్రి ఏర్పాటుకు 9 ఎకరాల భూమి కేటాయింపు
- టిడ్కో ఇళ్ల మౌలిక వసతుల కోసం రూ.4,450 కోట్ల రుణానికి ప్రభుత్వ గ్యారెంటీ
- అమరావతిలో వీధిపోటు ప్లాట్ల స్థానంలో వేరేవి ఇచ్చేందుకు రైతులకు అవకాశం
- అంతర్జాతీయ అథ్లెట్ జ్యోతి యర్రాజీకి గ్రూప్-1 ఉద్యోగం, ఇంటి స్థలం

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. పోలవరం ప్రాజెక్టును వేగవంతం చేయడం, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పేదలకు గృహ నిర్మాణం

మిగతా2లో



## మహారాష్ట్రలో కుప్పకూలిన విమానం

# డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం



### ప్రాణాలు కోల్పోయిన మరో నలుగురు

### ఎన్నికల ప్రచారానికివెళ్తుండగా ఘటన

- సీఎం ఫడ్నవీస్‌కు ప్రధాని మోదీ, అమిత్ షా ఫోన్
- ప్రమాదంలో అజిత్ పవార్ సహా ఐదుగురు మృతి చెందినట్లు డీజీసీఏ ధ్రువీకరణ
- ల్యాండింగ్ సమయంలో అదుపుతప్పి కూలిపోయిన విమానం
- సీఎం ఫడ్నవీస్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా
- స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా జరిగిన దుర్ఘటన

ముంబై: పెన్ పవర్మహారాష్ట్రలో విమానం కుప్పకూం ఘటనలో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ (66) సహా మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం ముంబై నుంచి బారామతి వెళ్తుండగా ఉదయం 8.45 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

మిగతా2లో



## ఇది ప్రమాదమే.. కుట్ర కాదు

### అజిత్ మృతిపై శరద్ పవార్ భావోద్వేగం

- విమాన ప్రమాదంలో మహారాష్ట్ర నేత అజిత్ పవార్ దుర్మరణం
- ఇది కేవలం ప్రమాదమేనని, కుట్ర కాదని శరద్ పవార్ స్పష్టీకరణ
- సమర్థుడైన నాయకుడిని కోల్పోయామంటూ భావోద్వేగం
- ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి

మిగతా2లో



## ఈ ఒప్పందం ద్వారా భారత్‌దే పైచేయి అవుతుంది

- భారత్-యూరోపియన్ యూనియన్ వాణిజ్య ఒప్పందం.. అమెరికా వాణిజ్య ప్రతినిధి కీలక వ్యాఖ్యలు
- ఈ ఒప్పందానికి సంబంధించిన వివరాలను పరిశీలించానన్న అమెరికా వాణిజ్య ప్రతినిధి
- దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందన్న జెమిసన్ గ్రీర్

మిగతా2లో

## చంద్రబాబు ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్



- రెండేళ్ల చంద్రబాబు పాలన 'జంగల్ రాజ్'లా ఉందని జగన్ విమర్శ
- మద్యం, ఇసుక మాఫియాలతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపణ
- టీడీపీ ఎమ్మెల్యేలు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా చర్యలు శూన్యమని వ్యాఖ్య
- సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని విమర్శ
- మరో ఏడాదిన్నరలో పాదయాత్ర చేపట్టి ప్రభుత్వాన్ని ఎండగడతానన్న జగన్

మిగతా2లో



## వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం

- పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం
- ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్.. ఈ నెల 29న ఆర్థిక సర్వే ప్రవేశపెట్టనున్న నిర్మల

పెన్ పవర్ డెస్క్:పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఢిల్లీలోని పార్లమెంట్‌లో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 29న (గురువారం) ఆర్థిక సర్వేను, ఫిబ్రవరి 1న (ఆదివారం) కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ.. గడిచిన ఏడాది వేగవంతమైన ప్రగతి, గొప్ప సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా నిలిచిపోయిందన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో 2026వ సంవత్సరం ఒక కీలకమైన పునాది సంవత్సరంగా

మిగతా2లో

## జనసేన కాదు.. కామసేన

### ఎమ్మెల్యే శ్రీధర్ వీడియోపై భగ్గుమన్న ఆర్కే రోజా

- జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వీడియో లీక్‌పై రోజా తీవ్ర ఆగ్రహం
- ఇది జనసేన కాదు, కామాంధుల సేన అంటూ తీవ్ర విమర్శలు
- నగరిలో వైసీపీ నేతలతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన
- పవన్, చంద్రబాబు, హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
- మహిళల భద్రతలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు సంబంధించిన రాసలీలల వీడియో వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనపై మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది జనసేన కాదని, మహిళల జీవితాలతో ఆడుకుంటున్న 'కామసేన' అని ఆమె తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే శ్రీధర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆమె సొంత నియోజకవర్గమైన నగరిలో వైసీపీ శ్రేణులతో కలిసి భారీ నిరసన చేపట్టారు. ఈ ఆందోళనలో భాగంగా తిరుపతి, చిత్తూరు

మిగతా2లో


## వెలిగొండపై జగన్‌ది అతిపెద్ద మోసం..

### ఆధారాలతో సహా బయటపెట్టిన మంత్రి నిమ్మల



- వెలిగొండపై జగన్ ప్రభుత్వం ప్రజలను దగా చేసిందన్న మంత్రి నిమ్మల
- పూర్తి కాని ప్రాజెక్టును ఎన్నికల ముందు జాతికి అంకితం చేశారని ఆరోపణ
- టన్నెళ్లు, హెడ్ రెగ్యులేటర్, ఫీడర్ కెనాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని వెల్లడి
- రూ.900 కోట్ల నిర్వాసితుల ప్యాకేజీని గత ప్రభుత్వం చెల్లించలేదని విమర్శ
- 2026 నాటికి వెలిగొండను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టీకరణ

మిగతా2లో



## రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

- పోర్టుల నుంచి ఇతర రాష్ట్రాలకు రైలు కనెక్టివిటీపై ప్రధానంగా చర్చ
- రాయలసీమ నుంచి కోస్తాకు మెరుగైన రైలు మార్గాలపై దృష్టి
- హై స్పీడ్ రైల్ కారిడార్ల ఏర్పాటు ప్రతిపాదనపై సమావేశంలో సమీక్ష
- విజయవాడ, విశాఖ వంటి జంక్షన్లలో రద్దీ తగ్గించడంపై చర్చ

మిగతా2లో

## అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు




పెన్ పవర్ డెస్క్:ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి భారీ సంఖ్యలో లేఆఫ్ ప్రకటించింది. గతేడాది అక్టోబర్‌లో 14 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించగా.. తాజాగా 16వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నట్లు పేర్కొంది.

మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# అజరామరాలు వేటూరి గీతాలు

వేటూరి జయంతి తెలుగు పదానికి పునరావృత జన్మదినం. ఆయన గేయ రచనా వైవిధ్యం ఎందరికో స్ఫూర్తి దాయకం. శ్రీశ్రీ తర్వాత జాతీయ అవార్డు అందుకున్న తెలుగు పాటల రచయత వేటూరి సుందర రామమూర్తి. మాతృదేవోభవ సినిమాలోని రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే పాటకు ఈ అవార్డు అందుకున్న వేటూరి. ఇటు క్లాసే కాదు.. అటు మాస్ సాంగ్స్ రాయడంలోనూ వేటూరి వారిది అందె వేసిన చెయ్యే. తొమ్మిది వేలకు పైగా అలవోకగా ధారాపాతంగా పాటలు రాసిన గొప్పతనం వేటూరిది. పల్లెటూరి మాటలైనా, సమాస భూయిష్ట సంక్లిష్ట పదాలైనా పండితుని నుండి పామరుని వరకూ అవలీలగా చేరి, సులభంగా ప్రతీ నోటా పాడుకునేలా చేసిన అసమాన ప్రతిభ ఆయనకే సొంతమైంది. వేటూరి సినిమా పాటలు రాయటానికి పూర్వం కొంతకాలం పత్రికల్లో పని చేసారు. తెలుగు భాష, సాహిత్యాలపై మక్కువ పెంచు కోవడానికి కారణం అయన పెదనాన్న వేటూరి ప్రభాకర శాస్త్రి, తెలుగులో ప్రథమ జ్ఞానపీఠ గ్రహీత కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ. 1960 సంవత్సర ప్రాంతాల్లో మొదట ఆంధ్ర పత్రికలో కాలూని, తర్వాత ఆంధ్రపత్రిక వీక్లీకి సహాయ సంపాదకుడుగా, ఆపై కొంతకాలం ఆంధ్రప్రభ వార పత్రిక కు చీఫ్ సబ్ ఎడిటర్ గా అయన పని చేశారు. ఎన్టీఆర్ నటించిన "దీక్ష" సినిమాలో మొదటిసారిగా సినిమాకు గీతరచన ప్రారంభించినా అది సినిమాలో రాలేదు. 1972 సంవత్సరం "ఓ సీత కథ" సినిమాలో లీల పాడిన హరికథతో, సినిమా దర్శకులు కె.విశ్వనాథ్ ప్రోత్సాహంతో సినిమా పాటల రచయితగా శ్రీకారం చుట్టి, వెనుతిరిగి చూడకుండా సాగుతూ, వరసగా సినిమా పాటలు రాస్తూ వచ్చారు. వేటూరిగా పిలవబడే వేటూరి సుందర రామమూర్తి (జనవరి 29, 1936 – మే 22, 2010) లాంటి రచయిత సినీ పరిశ్రమకు పరిచయం కావడం తెలుగు ప్రజలు చేసుకున్న పురాకృత సుకృతం. సుందర రామమూర్తి 1936 జనవరి 29 న కృష్ణా జిల్లా, మోపిదేవి మండలం పెదకళ్లే పల్లిలో జన్మించారు. మద్రాసులోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్, బెజవాడలో డిగ్రీ పూర్తి చేశారు. 1956 నుంచి పదహారేళ్ళ పాటు పాత్రికేయ వృత్తిలో ఉన్నారు. ముందుగా దైతా గోపాలం ఆ తర్వాత మల్లాది వద్ద శిష్యరికం చేశారు. వేటూరి సుందర రామ్మూర్తి 8 నంది అవార్డులతో పాటు మొత్తం 14 అవార్డులు, ఒక జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు పాటకు శ్రీశ్రీ తర్వాత జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టింది వేటూరియే. కేంద్ర ప్రభుతం తెలుగు భాషకు ప్రాచీన భాషా హోదా ఇవ్వనందుకు నిరసనగా తన పాటకు వచ్చిన జాతీయ పురస్కారాన్ని తిరిగి ఇచ్చి, తన మాతృ భాషాభిమానాన్ని చాటిచెప్పిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. వేటూరి మొదటి పాట ఓ సీత కథ. చివరి పాట బద్రినాథ్ లోని ఓంకారేశ్వరి పాట. ఆ మధ్యకాలంలో ఆయన వేల పాటలను రాశారు. ఓంకారేశ్వరి పాటలో 108 వైష్ణవ దివ్య స్థలాలను తన పాటలో వ్యక్త పరిచిన తీరు అసమానం. అపూర్వం, మహాద్భుతం. సంప్రదాయ కవిత్వ పద బంధాల నుండి జానపద గీతాల వరకు అన్నింటిలోనూ తన ప్రతిభను నిరూపించు కున్నారు. కవనంలో, భావంలో, భాషలో పండితుల నుండి పామరుల వరకు అందరిని అలరించిన విశిష్ట శైలి ఈయన సొంతం. వేటూరి సినీ పాటల పరంపర నాలుగు దశాబ్దాలకు పైగా నిరాటంకంగా కొనసాగింది. దర్శకులకు, నిర్మాతలకు, నటీ నటులకు, సినీ సంబంధీకులకు ఆలంబనగా నిలిచింది. శ్రోతల హృదయాలను దోచింది. పసలేని చిత్రాలను పాటల ద్వారా తీరాలకు చేర్చింది. ఒక్క మాటలో ... సినీ పరిశ్రమను అన్ని విధాలా ఆదుకుంది. వేటూరి పాటల పూదోటలో ప్రతీ పాటా పరిమళం కొల్పోని సుగంధ పుష్పాలే. ఎన్నటికీ వాడిపోని అందమైన లతాంతాలే. గానగంధర్వుడు దివంగత ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం మాటల్లో చెప్పాలంటే... 'ఉపనిషత్తుల నుంచి ఉలిపిరి కాయితం వరకూ , దేన్ని గురించైనా అపారమైన పరిజ్ఞానం ' వేటూరిది. మహా కవి శ్రీశ్రీ అన్నట్లు...తాను కన్న, విన్న, అనుభవించిన, ఊహించిన ప్రతి అంశాన్ని పదబద్ధం చేసి, కాదేదీ కవితకు అనర్హం అని నిరూపించిన నేర్పరి వేటూరి. వేటూరి భువి నుండి దివికేగినా, ఆయన పాటలు అజరామరాలు, నిరంతరం తెలుగు వారి నాలుకలపై నడయాడే సుస్వరాలు. తెలుగు ప్రజల మనో ఫలకాలపై చెరగని ముద్రలు వేసి 75 సంవత్సరాల వయస్సులో మే 22, 2010 న హైదరాబాదులో గుండెపోటుతో మరణించారు. తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయారు.

## విశాఖకు ఏఐజీ ఆసుపత్రి..

- మొదటి పేజి తరువాయి

వంటి అంశాలపై కేబినెట్ ప్రధానంగా దృష్టి సారించింది. సమావేశం అనంతరం సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు.

### పోలవరం పూర్తికి అదనపు నిధులు

వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. డ్యామ్ నిర్మాణానికి అవసరమైన రాయిని సేకరించేందుకు రూ. 247 కోట్లు, లెఫ్ట్ సైడ్ కనెక్టివిటీలో నావిగేషన్ టన్నెల్ నిర్మాణం కోసం రూ. 4.49 కోట్ల అదనపు బడ్జెట్‌కు కేబినెట్ ఆమోదం తెలిపిందని వివరించారు. డ్యామ్ నిర్మాణానికి 71.63 లక్షల క్యూబిక్ మీటర్ల రాయి అవసరం కాగా, గతంలో తవ్విన రాళ్లలో 50% మాత్రమే నాణ్యంగా ఉన్నాయని, అందువల్ల హిల్ నెం. 902 నుంచి కొత్తగా రాయిని వెలికితీయడానికి ఈ నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ పనులను మెగా ఇంజనీరింగ్ లిమిటెడ్ (వీజుxూ)కు అప్పగించారు.

### గృహ నిర్మాణం, అమరావతిపై కీలక నిర్ణయాలు

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కింద టిడ్కో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతుల కోసం హడ్కో నుంచి రూ. 4,450 కోట్ల రుణం పొందేందుకు ఏపీ టిడ్కోకు ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీని కేబినెట్ రాటిఫై చేసింది. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వం జూన్ నాటికి పెండింగ్ ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని మంత్రి స్పష్టం చేశారు. కొత్తగా ఇళ్ల కోసం వచ్చిన 10 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, 2029 నాటికి అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందించడమే లక్ష్యమని సీఎం ఆదేశించినట్లు తెలిపారు.

అమరావతిలో భూసమీకరణలో భాగంగా ప్లాట్లు పొందిన రైతుల్లో వీధిపోటు, ఇతర వాస్తు సమస్యలు ఉన్న 112 మందికి వేరే ప్లాట్లు కేటాయించేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారం ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ అవకాశం ఒరిజినల్ అలాటీలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. అలాగే, రాజధాని ప్రాంతంలో భూమిలేని నిరుపేదలకు ఇచ్చే రూ. 5000 పెన్షన్‌ను, వారి తల్లిదండ్రులు మరణిస్తే మైనర్ పిల్లలకు బదిలీ చేసేందుకు కూడా ఆమోదం లభించింది.

# వికసిత్ భారత్‌కు 2026 పునాది సంవత్సరం

- మొదటి పేజి తరువాయి

నిలుస్తుందని ఆమె అభివర్ణించారు. గత దశాబ్ద కాలంలో భారత్ అన్ని ప్రధాన రంగాలలో తన పునాదులను పటిష్ఠం చేసుకుందని, భవిష్యత్ వృద్ధికి బలమైన మార్గాన్ని నిర్మించుకుందని పేర్కొన్నారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న వేడుకలను ఆమె గుర్తుచేశారు. శ్రీ గురు తేజ్ బహదూర్ జీ 350వ షహీదీ దివస్, బిర్సా ముండా, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను ప్రస్తావించారు. దేశం తన పూర్వీకుల సేవలను గౌరవించుకున్నప్పుడు, యువతరంలో స్ఫూర్తి రగులుతుందని, అది అభివృద్ధి చెందిన భారత్ దిశగా దేశ ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని రాష్ట్రపతి తెలిపారు. కాగా, సమావేశాలకు ముందు మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరిస్తామని నేతలు హామీ ఇచ్చారు. ఓట్ల దొంగతనం ఆరోపణలు, ఓటర్ల జాబితా సవరణ, ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పథకం వంటి ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తామని కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశంలో తెలిపింది.

# మహారాష్ట్రలో కుప్పకూలిన విమానం

# డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

- మొదటి పేజి తరువాయి

సాంకేతిక లోపం కారణం గానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోం ది. ముంబై నుంచి బయల్దేరిన గంట తర్వాత విమానంలో సమస్య తలెత్తింది. ఎమర్జెన్సీ ల్యాండింగ్ సమయంలో విమానం అదుపుతప్పి కూలిపోయింది. ఆ వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. ప్రమాద తీవ్రతకు విమానం రెండు ముక్కలైనట్లు సమాచారం. విమాన ప్రమాదం పై డీజీసీఏ స్పందించింది. విమానంలో ఎవరూ బతికి లేరని వెల్లడించింది. అజిత్ పవార్, ఇద్దరు వ్యక్తిగత సిబ్బంది, ఇద్దరు విమాన సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. అజిత్ పవార్ 1959 జులై 22న జన్మించారు. ఆయన తండ్రి అనంత్రావ్ పవార్.. మహారాష్ట్ర మాజీ సీఎం శరద్ పవార్కు సోదరుడు. బాబాయి శరద్ పవార్ అడుగుజాడల్లో రాజకీయాల్లో కి అడుగుపెట్టిన అజిత్పవార్.. 1982లో తొలిసారి కార్పొరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ బోర్డుకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 16 ఏళ్ల పాటు పుణె జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మ న్గా వ్యవహరించారు. 1991లో తొలిసారి బారామతి పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి లోక్సభకు ఎన్నికయ్యారు. అనంతరం శరద్ పవార్ కోసం ఆ సీటును త్యాగం చేసి.. రాష్ట్ర రా జకీయాల్లోకి వచ్చారు. 1991 ఉప ఎన్నికల్లో బారామతి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొం దారు. ఈ నియోజకవర్గం నుంచి ఏడుసార్లు మహారాష్ట్ర ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు.

# వెలిగొండపై జగన్‌ది అతిపెద్ద మోసం..

గత వైసీపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు విషయంలో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలను ఘోరంగా మోసం చేసిందని, పనులు పూర్తికాకుండానే ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించి 'క్రెడిట్ చోరీ'కి పాల్పడిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల నిర్లక్ష్యాన్ని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న పనుల పురోగతిని గణాంకాలు, ఫొటోలతో సహా వివరించారు. 2026 నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశంలో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.

గత మార్చి 6న, ఎన్నికలకు ముందు, నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని, కానీ ఆ రోజుకు ప్రాజెక్టులో కీలకమైన పనులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయని నిమ్మల ఆరోపించారు. "ప్రాజెక్టు పూర్తయితే పండగ వాతావరణం ఉండాలి. కానీ, ఆనాడు 144 సెక్షన్ పెట్టి, రైతు నాయకులను, నిర్వాసితులను హౌస్ అరెస్టులు చేసి పోలీసు పహారా మధ్య ప్రారంభోత్సవం చేయడం, జగన్ ప్రభుత్వ మోసానికి నిలువెత్తు నిదర్శనం" అని ఆయన విమర్శించారు.

### పూర్తి కాని పనులు.. ప్రమాదకర స్థితి

మంత్రి నిమ్మల ప్రాజెక్టులోని ప్రతి దశలోనూ వైసీపీ ప్రభుత్వం వదిలేసిన పనులను వివరంగా తెలియజేశారు.

హెడ్ రెగ్యులేటర్: శ్రీశైలం నుంచి నీటిని టన్నెల్‌లోకి మళ్లించే హెడ్ రెగ్యులేటర్ వద్ద 4,300 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని మిగిలి ఉండగానే ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. దానికి రక్షణగా ఉండే వింగ్స్, రిటర్న్స్ నిర్మించకపోవడంతో నీటిని వదిలితే మొత్తం నిర్మాణం కూలిపోయే ప్రమాదం ఉండేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు.

టన్నెల్ 1 & 2: టన్నెల్ 1లో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి ఉందని, టన్నెల్ 2లో దాదాపు 7 కిలోమీటర్ల లైనింగ్, 4,924 మీటర్ల బెంచింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. "లైనింగ్ చేయకుండా నీటిని వదిలితే సొరంగం కూలిపోయే ప్రమాదం ఉంది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 702 మీటర్ల లైనింగ్ చేస్తే, మేము 18 నెలల్లోనే 3,708 మీటర్ల పని పూర్తి చేశాం" అని ఆయన పోల్చి చెప్పారు. టన్నెల్ బోరింగ్ మెషిన్ (ఁదీవీ): టన్నెల్ 2లో 11వ కిలోమీటరు వద్ద 600 అడుగుల పొడవైన భారీ టన్నెల్ బోరింగ్ మెషిన్ (ఁదీవీ) చిక్కుకుపోయిందని, అది నీటి ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకుంటుందని తెలిపారు. దాన్ని తొలగించకుండా హైకోర్టు ఇచ్చిన స్టేను వెకేట్ చేయించడానికి కూడా గత ప్రభుత్వం ప్రయత్నించలేదని ఆరోపించారు.

ఫీడర్ కెనాల్, నిర్వాసితులు: 11,500 క్యూసెక్కుల నీటిని తట్టుకోవాల్సిన 21 కిలోమీటర్ల ఫీడర్ కెనాల్, చిన్నపాటి వర్షానికే గండ్లు పడిన దారుణ స్థితిలో ఉందని ఫోటోలు చూపించారు. ఇప్పుడు రూ.456 కోట్లతో ఈ పనులను ప్రారంభించామని తెలిపారు. అత్యంత ముఖ్యంగా, ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.900 కోట్ల ఆర్&ఆర్ ప్యాకేజీని గత ప్రభుత్వం చెల్లించలేదని, పునరావాస కాలనీల నిర్మాణం చేపట్టలేదని మండిపడ్డారు.

### పదేపదే తప్పుడు తేదీలు

జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు 2020 నుంచి 2023 వరకు నాలుగుసార్లు వేర్వేరు తేదీల్లో ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పి, చివరకు ఏ పనీ చేయకుండా ఎన్నికల ముందు ప్రారంభోత్సవ నాటకమాడారని నిమ్మల విమర్శించారు. పూర్తికాని ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కావాలని వైకాపా ఎమ్మెల్యేలే అడగడం వారి మోసానికి సాక్ష్యమని అన్నారు. హంద్రీనీవా తరహాలోనే, వెలిగొండను కూడా 2026 నాటికి పూర్తి చేసి ప్రకాశం జిల్లా రైతుల దశాబ్దాల కలను నిజం చేస్తామని మంత్రి రామానాయుడు భరోసా ఇచ్చారు.

# చంద్రబాబు ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భీమవరం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గడిచిన రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో 'జంగల్ రాజ్' నడుస్తోందని, 'దోచుకో, పంచుకో, తినుకో' అనే రీతిలో పాలన సాగుతోందని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలన్నీ అబద్ధాలేనని తేలిపోయిందని అన్నారు. "చంద్రబాబు ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఈ రెండేళ్లలో రైతులు, మహిళలు, యువత సహా ఏ ఒక్క వర్గానికైనా మంచి జరిగిందా? మా ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేశారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి ప్రతి హామీని నెరవేర్చిన పాలన మాది. కానీ ఇప్పుడు హామీలను మోసపూరితంగా గాలికొదిలేశారు. ఎన్నికలప్పుడు బాండ్లు పంచిపెట్టి ప్రజలను దగా చేశారు. ఇలాంటి మోసాలు చేసే వారిపై 420 కేసులు పెడతారు. కానీ చంద్రబాబు, ఆయన కూటమి నేతలు మాత్రం బయట తిరుగుతున్నారు," అని జగన్ విమర్శించారు. రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి రాజ్యమేలుతోందని జగన్ ఆరోపించారు. "మద్యం వ్యాపారం మొత్తం మాఫియా చేతుల్లోకి వెళ్లింది. ప్రైవేట్ షాపులన్నీ వాళ్ల మనుషులకే ఇచ్చారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను వేలం పెట్టి మరీ అమ్ముకుంటున్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతూ, పర్మిట్ రూమ్‌లు నడుపుతూ, కల్తీ మద్యం అమ్ముతూ ప్రజల రక్తం తాగుతున్నారు. ఇసుక మా హయాంలో ప్రభుత్వానికి ఏటా రూ.750 కోట్లు ఆదాయం తెచ్చిపెడితే, ఇప్పుడు ఫ్రీ అని చెప్పి అక్రమంగా తవ్వేస్తూ రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు," అని జగన్ ఆరోపించారు. సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని, ఇది జంగల్ రాజ్ కాకపోతే మరేమిటని ఆయన ప్రశ్నించారు. "రోడ్లపై రికార్డింగ్ డ్యాన్సులు, మొబైల్ వ్యాన్లలో మద్యం అమ్మకాలు జరిపారు. ఈ అరాచకాల కోసం నియోజకవర్గాల్లో వేలం పాటలు నిర్వహించారు. 'ఊపేయ్, కుదిపేయ్' అంటూ యూనిఫామ్‌లో ఉన్న డీఎస్పీనే ప్రోత్సహించడం సిగ్గుచేటు," అని మండిపడ్డారు. టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ ఆరోపించారు. "కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఒక ప్రభుత్వ ఉద్యోగినిని రేప్ చేస్తే, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులతో ఒక ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయత్నం చేస్తే చర్యలు లేవు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మంత్రి సంధ్యారాణి పీఏ, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్‌లపై తీవ్ర ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదు. స్వయంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ అశ్లీల నృత్యాలు చేస్తూ చిందులేస్తున్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడే వీరందరినీ ప్రోత్సహిస్తున్నారు," అని జగన్ ఆరోపించారు. ఇంకో ఏడాదిన్నరలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని, సుమారు 150కి పైగా నియోజకవర్గాల్లో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతానని జగన్ ప్రకటించారు. "కళ్లు తెరిచి మూసేలోగా మూడేళ్లు గడిచిపోతాయి. నా పాదయాత్ర మొదలైతే ప్రజల్లోనే ఉంటాను. చంద్రబాబు ప్రభుత్వ అన్యాయాలను ప్రతి ఇంట్లోనూ చర్చ జరిగేలా చేయాలి. కార్యకర్తలు సంఘటితంగా ఉండి, అనుబంధ విభాగాలను బలోపేతం చేయాలి. జగన్ 2.0లో కార్యకర్తలకే ప్రథమ స్థానం ఉంటుంది," అని ఆయన భరోసా ఇచ్చారు.

# రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టుల పురోగతి, కొత్త మార్గాల ఏర్పాటుపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. సచివాలయంలో దక్షిణ మధ్య, తూర్పు కోస్తా, దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ల జనరల్ మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రైలు కనెక్టివిటీని మెరుగుపరచడం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను వేగవంతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రాష్ట్రంలోని వివిధ పోర్టుల నుంచి తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలోని హింటర్ ల్యాండ్‌కు సరుకు రవాణాను పెంచేందుకు అవసరమైన రైలు అనుసంధానంపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. అలాగే, రాయలసీమ ప్రాంతాల నుంచి కోస్తాంధ్రలోని వివిధ ప్రాంతాలకు కనెక్టివిటీని మెరుగుపరిచే అంశాలపైనా సమీక్షించారు. విశాఖపట్నం, విజయవాడ, గుంతకల్, గుంటూరు,

రేణిగుంట వంటి ప్రధాన జంక్షన్లలో రైళ్ల రద్దీని తగ్గించే మార్గాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. విజయవాడ బైపాస్, భద్రాచలం రోడ్-కొవ్వూరు వంటి కొత్త రైల్వే లైన్ల ప్రతిపాదనల పురోగతిని కూడా సీఎం సమీక్షించారు. గిరిజన ప్రాంతాలకు రైలు సౌకర్యాన్ని విస్తరించడంపై ప్రత్యేకంగా చర్చించారు.

హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు మార్గాలను హై స్పీడ్ రైల్వే కారిడార్లుగా అభివృద్ధి చేసే ప్రణాళికలపైనా ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రైల్వే నెట్‌వర్క్ విస్తరణ కీలకమని ఈ సందర్భంగా చంద్రబాబు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

# ఇది ప్రమాదమే.. కుట్ర కాదు

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మృతి చెందిన ఘటనపై సీనియర్ నాయకుడు శరద్ పవార్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఇది కేవలం ప్రమాదం మాత్రమేనని, దీని వెనుక ఎలాంటి కుట్ర లేదని ఆయన స్పష్టం చేశారు. "అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రకు తీరని నష్టం వాటిల్లింది. ఒక సమర్థుడైన నాయకుడిని ఈ రోజు మనం కోల్పోయాం. ఈ లోటు ఎప్పటికీ పూడ్చలేనిది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "అన్నీ మన చేతుల్లో ఉండవు. కొన్ని సంఘటనల వెనుక ఎలాంటి రాజకీయం ఉండదు. దయచేసి ఈ విషయాన్ని రాజకీయం చేయవద్దు. ఈ బాధను మహారాష్ట్ర, మనమందరం ఎప్పటికీ భరించాల్సిందే" అని శరద్ పవార్ అన్నారు. కాగా, అజిత్ పవార్ ప్రయాణిస్తున్నది వీఎస్ఆర్ ఏవియేషన్‌కు చెందిన బాంబార్డియర్ లియర్ జెట్- 45 విమానంగా అధికారులు గుర్తించారు. ప్రమాద స్థలంలో దట్టమైన పొగలు కమ్ముకున్న దృశ్యాలు టీవీ ఛానళ్లలో ప్రసారమయ్యాయి.

# ఈ ఒప్పందం ద్వారా భారత్‌దే పైచేయి అవుతుంది

భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా స్పందించింది. ఈ మేరకు అగ్రరాజ్యం వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కొన్ని వివరాలను పరిశీలించానని, దీని వల్ల భారత్‌కే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఐరోపా మార్కెట్‌లో భారత్‌కు ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దీంతో ఈ ఒప్పందం ద్వారా భారత్‌ది పైచేయి అవుతుందని అన్నారు. భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయ ఉత్పత్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తు చేశారు. మా దేశంలోకి దిగుమతి అయ్యే ఉత్పత్తులపై అధిక టారిఫ్ విధిస్తుండటంతో పలు దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈయూ, భారత్ మధ్య ఒప్పందం కుదిరినట్లు వెల్లడించారు.

# అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు

- మొదటి పేజి తరువాయి

ఈ విషయాన్ని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెటీ అధికారికంగా వెల్లడించారు. 2023 తర్వాత ఈ స్థాయిలో ఉద్యోగులను తొలగించడం ఇదే తొలిసారి. అప్పుడు దాదాపు 27వేల మందికి అమెజాన్ లేఆఫ్‌లు ప్రకటించిన విషయం తెలిసిందే. తొలగింపు ప్రక్రియలో భాగంగా.. కార్పొరేట్ ఉద్యోగుల స్థానంలో జనరేటివ్ ఏఐను వినియోగించే యోచనలో ఉన్నట్లు అమెజాన్ పేర్కొంది. కరోనా సమయంలో తీసుకున్న ఉద్యోగుల సంఖ్యలో భారీగా కోత విధిస్తున్నట్లు తెలిపింది. పలు విభాగాలను తగ్గించి, భాగస్వామ్యం పెంచడం, పాలనా వ్యవస్థలను తొలగించే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించింది. అయితే, ఏయే విభాగాల్లో ఈ తొలగింపులు ఉంటాయనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. అక్టోబర్‌లో చేపట్టిన సంస్థాగత మార్పులు పూర్తయ్యాయని వెల్లడించిన గలెటీ.. అంతర్గతంగా కొత్త రోల్ వెతుక్కునేందుకు అమెరికా ఉద్యోగులకు 90 రోజుల గడువు ఇస్తున్నామని చెప్పారు. ఆలోగా కొత్త రోల్‌ను ఎంచుకోని వారికి నిబంధనల ప్రకారం ఇతర ప్రయోజనాలు అందిస్తామన్నారు. ఈ మార్పులు చేస్తూనే వ్యూహాత్మక విభాగాల్లో నియామకాలు కొనసాగిస్తామన్నారు.

## జనసేన కాదు.. కామసేన

- మొదటి పేజి తరువాయి

జిల్లాల వైసీపీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప తదితరులతో కలిసి రోజా ఏజేఎస్ కళ్యాణ మండ పం నుంచి ఓం శక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార మదంతో ఒక మహిళా ఉద్యోగిని బెదిరించి, ఆమె జీవితాన్ని నాశనం చేసిన కీచక ఎమ్మెల్యేను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు.

### పవన్, చంద్రబాబు, హోంమంత్రిపై తీవ్ర విమర్శలు

ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఆడవాళ్లకు అన్యాయం చేస్తే రోమాలు పీకేస్తా, చర్మం ఒలుస్తా అని ఊగిపోయే పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎక్కడ? ఏం చేస్తున్నారు?" అని సూటిగా ప్రశ్నించారు. "గతంలో జానీ మాస్టర్, కిరణ్ రాయల్, వినూత్న వంటి వారు తప్పు చేసినప్పుడే కఠిన చర్యలు తీసుకుని ఉంటే, ఈరోజు మీ ఎమ్మెల్యే శ్రీధర్ ఇంతటి దుశ్చర్యకు పాల్పడేవాడా?" అని నిలదీశారు. వీడియోలో ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, త్రీ-మెన్ కమిటీ వేసి కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీలు, స్పెషల్ ఫ్లైట్ల కోసమే పవన్ రాష్ట్రానికి వస్తారని, ప్రజల కష్టాలను పట్టించుకోరని ఆరోపించారు.

అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనితపైనా రోజా విమర్శల వర్షం కురిపించారు. మహిళా హోంమంత్రి ఉన్నప్పటికీ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, తన సొంత జిల్లా విశాఖలో డ్రగ్స్, గంజాయిని అరికట్టలేని మంత్రి రాష్ట్రాన్ని ఏం కాపాడతారని ఎద్దేవా చేశారు. గతంలో కాల్ మనీ సెక్స్ రాకెట్ అయినా, ఇప్పుడు సొంత పార్టీ, మిత్రపక్ష ఎమ్మెల్యేల అరాచకాలైనా మహిళలను కాపాడటంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని, ఆయనో 'చేతగాని దద్దమ్మ ముఖ్యమంత్రి' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, హోంమంత్రి అనిత తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని రోజా డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళల ఆత్మగౌరవానికి రక్షణ లేదనడానికి ఈ ఘటనే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. వైసీపీ ఆందోళనతో నగరిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## విధి నిర్వహణ లో అలసత్వం వహిస్తే...

# సహించేదిలేదు...

### ఉమ్మడి జిల్లాలోని పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ సమీక్షా





**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 28**

ఉమ్మడి ప్రకాశం, మార్కాపురం జిల్లాలోని కనిగిరి సబ్ డివిజన్ లోపాటు ఒంగోలు, దర్శి డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో బుధవారం ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ ముఖ్యంగా గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, హత్య కేసులు, పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్స్, రోడ్డు ప్రమాదాలు, దేవాలయాల వద్ద భద్రత ఎర్పాట్లు, అయా సబ్ డివిజన్ లోని సిసికెమెరాల పనితీరు, ఎన్ఫోర్స్మెంట్, ఇతర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రాపర్టీ నేరాల కట్టడి, నిందితులు గుర్తింపు, రికవరీకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగ సొత్తు రికవరీ చేయాలని, అనుమానితుల వ్యక్తులను ఫింగర్ ప్రింట్ మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ ద్వారా ఫింగర్ ప్రింట్ సేకరించి తనిఖీ చేయాలన్నారు. మహిళలపై జరిగే నేరాలు, పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి భాదితులకు న్యాయం చేకుర్చాలని, పోలీస్ స్టేషన్ల పరిధిలో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా (డ్రోన్ కెమెరాలతో) పెట్టి కట్టడి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బ్లాక్ స్పాట్స్ పై దృష్టి సారించాలన్నారు. జాతీయ రహదారుల్లోకి సర్వీస్ రోడ్లు కలుస్తున్న చోట ప్రమాదాల నివారణకు మిర్రర్లు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ బ్రేకర్లు వంటివి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా రహదారులపైన వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేసులను అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి పూర్తిస్థాయిలో సాక్ష్యాధారాలు సేకరించాలని, ఆర్ఎఫ్ఎస్ఎల్, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులను త్వరితగతిన తెప్పించుకుని పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఎన్ బి డబ్ల్యూ వారెంట్స్ పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పోలీస్ అధికారులు అందరూ తమ తమ పరిధిలో ఉన్న గ్రామాలను సందర్శించి అక్కడ ఎటువంటి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తరచూ నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అలాంటి ప్రాంతాలలో పోలీసు అధికారులు విజిబుల్ పోలీసింగ్ ను పెంచి ముందస్తుగానే నేరాలను నియంత్రించాలి. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. సైబర్ నేరాల పై ప్రజలలో మరింత అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి స్కూల్, కాలేజీ విధ్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పై ప్రత్యేకదృష్టి కేంద్రకరించి, గంజాయి, డ్రగ్స్, గ్యాంబ్లింగ్, మట్కా శిబిరాల దాడులు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు వాహనాల తనిఖీలు, బీట్స్ , పెట్రోలింగ్ , చేపట్టాలని , బోర్డర్ చెక్ పోస్ట్ లలో నిత్యం నిఘా ఉంచి అక్రమరవాణా పై అడ్డుకట్ట వేయాలన్నారు. గ్రామాలను , వార్డులను సందర్శించి అక్కడ ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని ఎటువంటి తగాదాలు, మత ఘర్షణలు తదితర నేరాలపై పెప్పటికప్పుడు సమాచారం సేకరించి పై అధికారులకు తెలపాలని, గ్రామాలలో పల్లెనిద్ర చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీ విధుల్లో అప్రమత్తంగా తిరుగుతూ పాత నేరస్థులను తనిఖీ చేసి నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శక్తి యాప్ పై అవగాహన శక్తి కాల్స్ పై వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు. కెమెరాలు/డ్రోన్ ల యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియచేసి ఏర్పాటు చేసే విధంగా చూడాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటిస్తూ పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలిగి వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలని, మహిళలు,చిన్నారుల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పదించాలని, పోలీస్ శాఖపై నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో గుర్తించి ప్రజల సహకారంతో వాటిని శుభ్రం చేయాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఒంగోలు డి.ఎస్.పి రాయపాటి శ్రీనివాసరావు, దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ, డిసిఆర్బి సిఐ దేవ ప్రభాకర్, సబ్ డివిజన్ సిఐలు ఎస్ఐలు పాల్గొన్నారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

## మా ఇంటూరి... మచ్చలేని మనిషి

-కందుకూరుకు దొరికిన ఆణిముత్యం ఆయన

-బుర్రా పసలేని ఆరోపణలు ఇకనైనా మానుకోండి

-వైసీపీ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన లింగసముద్రం టిడిపి నేతలు

-2019-24 మధ్య దోపిడీని జనం ఇంకా మర్చిపోలేదు

- జడ్పిటిసి భూకబ్జాలపై విచారణ చేయాలని డిమాండ్

**కందుకూరు పెన్ పవర్, జనవరి 28:**

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుపై, వైసిపి ఇన్చార్జి బుర్రా మధుసూదన్ చేసిన ఆరోపణలను లింగసముద్రం టిడిపి నేతలు తీవ్రంగా ఖండించారు. మంచి మనిషి, అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ఎమ్మెల్యేపై పసలేని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.లింగసముద్రంలో బుధవారం టిడిపి నేతలు మీడియాతో మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు పూరిమిట్ల గురునాథం మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అవినీతికి ఆస్కారం లేకుండా అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా నిరంతర అభివృద్ధి కనిపిస్తోందని, ప్రజల ఆశీర్వాదాలు ఆయనకి మెండుగా ఉన్నాయన్నారు. అలాంటి మచ్చలేని ఎమ్మెల్యేపై బుర్రా మధుసూదన్ ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని, 2019- 24 మధ్య వైసీపీ చేసిన దోపిడీని ఆయన గుర్తు చేసుకుంటే బాగుంటుందని అన్నారు. కనిగిరిలో అన్నింటిలో అవినీతి చేసినందుకే, అక్కడినుంచి కందుకూరుకు ట్రాన్స్ఫర్ చేసిన సంగతి మరిచిపోవద్దని టీడీపీ నేతలు హెచ్చరించారు. వైసీపీ జడ్పిటిసి చెన్ను నళిని పద్మ, ఆమె భర్త ప్రసాద్ వ్యవహార శైలిపై టిడిపి నేతలు విరుచుకుపడ్డారు. గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని అనేక భూములను కబ్జా చేశారని, బలవంతంగా ఆన్లైన్లో తమ పేర్లు మీద నమోదు చేయించుకున్నారని ఆరోపించారు. చివరకు పీర్లచావడి స్థలాన్ని కూడా వదిలిపెట్టలేదన్నారు. గతంలో వీరు చేసిన ఆగడాలపై విచారణ జరిపితే, మరికొన్ని వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.



**లినా భూమిని కాజేసేందుకు జడ్పిటిసి దంపతుల కుట్ర - రైతు హనుమంతరావులి ..:** పెదపవని పంచాయతీలోని ముత్యాలపాడు పరిధిలో 863/1 సర్వే నెంబరులో 5.24 ఎకరాల భూమిని తాను కొనుగోలు చేసినట్లు రైతు గుండపుశెట్టి హనుమంతరావు మీడియాకు వివరించారు. 1995లో ఆదాల రేవతి దగ్గర నుంచి తాను కొనుగోలు చేశానని, అయితే గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఆ భూమిని ఆక్రమించేందుకు జడ్పిటిసి చెన్ను నళిని పద్మ దంపతులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. రెండేళ్ల క్రితం తాను ఆ భూమిలో జామాయిల్ మొక్కలు వేయగా, జడ్పిటిసి మనుషులు వాటిని పీకివేసి, తనను చంపేందుకు ప్రయత్నించారని హనుమంతరావు తెలిపారు. తన ఫిర్యాదు మేరకు జడ్పిటిసి, వారి అనుచరులపై రెండు కేసులు కూడా నమోదయ్యాయని తెలిపారు. ఇంకా అనేక స్థలాలను ఆక్రమించిన చరిత్ర వారిదన్నారు. తనకు జడ్పిటిసి నుంచి ప్రాణహాని ఉందని, పోలీసులు, అధికారులు జోక్యం చేసుకొని తనకు న్యాయం చేయాలని హనుమంతరావు అభ్యర్థించారు. తన పొలాన్ని చదును చేసుకోవడంలో భాగంగానే కొంత మట్టిని తవ్వాల్సి వచ్చిందని వివరణ ఇచ్చారు. అంతే తప్ప తన స్థలం నుంచి మట్టిని అక్రమంగా తరలించలేదన్నారు. ఈ సమావేశంలో మండల టిడిపి అధ్యక్షులు పూరిమిట్ల గురునాథం, పార్టీ నాయకులు అడపా రంగయ్య, సోంపల్లి మనోహర్, షేక్ రఫీ, కరీముల్లా, గాలంకి ప్రసాద్, ఉన్నం వీరాస్వామి, కిలారి కొండయ్య, బోయిళ్ళ కొండప నాయుడు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరిలో ట్రిపుల్ ఐటీ భవన నిర్మాణానికి త్వరలో టెండర్లు

### - మంత్రి నారా లోకేష్ ఆదేశం



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 28**

ప్రకాశం జిల్లా కనిగిరిలో ట్రిపుల్ ఐటీ శాశ్వత భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మంత్రి నారా లోకేష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కనిగిరి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. ముఖ్యంగా కనిగిరిలో మంజూరైన ట్రిపుల్ ఐటీ కళాశాల భవన నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే కేటాయించాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి పై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా, భవన నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. కనిగిరి ప్రాంత విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. ఈ భేటీపై ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, కనిగిరి చిరకాల కోరిక అయిన ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి సహకరిస్తున్న మంత్రి నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి చేసి చెపిస్తున్నాం

### 5 కోట్లతో మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు

### డ్రైనేజీలు, సిసి రోడ్లు నీటిసౌకర్యం, మెరుగైన పారిశుధ్యం, కల్పించటమే లక్ష్యం

### పట్టణం సుందరంగా తీర్చిదిద్దటం, ఆదర్శ మున్సిపాలిటీగా నిలపాటమే ప్రధానాలక్ష్యం

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 28**

గిద్దలూరు ముంచిపాలిటిలో కావలసినంత అభివృద్ధి శివారు ప్రాంతాల్లో సైతం చేసి చూపిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు తెలిపారు. తలపెట్టిన అభివృద్ధి పనులు 80శాతం పూర్తికాగా మరికొన్ని పనులు జరుగుతున్నాయని, పనులన్నీ నాణ్యత ప్రమాణాల కనుగుణంగా జరుగుతున్నాయన్నారు. ఈ అభివృద్ధి పనుల్లో అధిక శాతం సి సి రోడ్లు , డ్రైనేజీలు వేసవిలో నీటిసమస్యను అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మున్సిపాలిటి పరిధిలోని శివారు ప్రాంతలలలో సైతం మౌలిక సదుపాయాలు కలిస్తున్నామన్నారు. ఇందులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రోత్సాహం ఎంతోఉందన్నారు.ముక్యంగా వేసవిలో నీటిసమస్యను అధిగమించేందుకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకొని ఆ ప్రకారం ముందుకు సాగుతున్నామన్నారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తున్నామన్నారు. ఇప్పటికే నంద్యాల, గిద్దలూరు రోడ్డు




లో విద్యుత్ దీపాల స్తంభాలకు రంగు రంగుల విద్యుత్ దీపకాంతులు తో జిగేల్ మనిపించమని, పట్టణంలో అన్ని వీధి లైట్లు వెలుగుతున్నాయన్నారు. ఈ అభివృద్ధి ని ప్రజలు సద్వినియోగం చేసుకుంటూ, మున్సిపాలిటికి చెల్లిలించవలసిన పన్ను బకాయిలను సకాలంలో చెల్లించాలని , మురుగు నీరు వెళ్లే డ్రైనేజీలో ఎలాంటి ఘనపదార్థాలాంటి, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయక మురుగు నీరు వెళ్ళేవిధంగా ప్రజలు సహకరించాలన్నారు. చెత్తను రోడ్లపై వేయరాదని చెత్త సేకరించే కార్మికుల మీ ఇంటి దగ్గరికి వచ్చినప్పుడు అందజేయాలన్నారు. పారిశుధ్యం మెరుగ్గా ఉంటే మన ఆరోగ్యాని కి మేలన్నారు. ప్రస్తుతం చేస్తున్న అభివృద్ధి కొంతేనని , ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మదిలో ఇంకా ఎంతో అభివృద్ధి చేయాలని మెదులుతుందని, ఇప్పటికే ప్రభుత్వానికి పలు అంచనాలను రూపొందించి పంపటం జరిగిందన్నారు. చెత్త రహిత మున్సిపాలిటీగా సుందరికరించి. ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దే సంకల్పానికి ప్రజలు సహకరించాలన్నారు.



## టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టిన విద్యాశాఖ

### విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు చేస్తున్న విద్యాశాఖ



**పెద్ద దోర్నాల పెన్ పవర్ జనవరి 28**

ప్రభుత్వ పాఠశాల చదువుతున్న 10 తరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల విద్యా ప్రణాళికను ఇవ్వడం జరిగింది అని ఎంఈఓ బి మస్తాన్ నాయక్ తెలిపారు బుధవారం స్థానిక ప్రభుత్వంతో పాఠశాలలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎంఈఓ మస్తాన్ నాయక్ మాట్లాడుతూ . ఈ ప్రణాళిక ప్రకారం ప్రతి రోజు స్టడీ అవర్స్ నిర్వహించి, స్లిప్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుంది. ఈ స్టడీ అవర్స్ సక్రమంగా హాజరు విద్యార్థులను గుర్తించి, వారిని ఉపాధ్యాయులకు దత్తత ఇవ్వడం జరిగింది అదేవిధంగా ఆ విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో, మాట్లాడి, విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరడమైనది ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దోర్నాల నందు స్టడీ అవర్స్ కాని, విద్యార్థులను గుర్తించి, వారు సక్రమంగా హాజరయ్యే ఉద్దేశంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల పి. శ్యామ్ ప్రసన్న తాంజలి విశేషమైన కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో, పాఠశాలలో నిర్వహించే స్టడీ అవర్స్ హాజరు కానీ కొంతమంది విద్యార్థులను గుర్తించి, వారిని స్వయంగా పాఠశాలకు తీసుకువచ్చి, వారికి అవసరమైన మార్గనిర్దేశం చేయడంతో పాటు కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రామా నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు కూడా పాల్గొని విద్యార్థులకు ధైర్యం చెప్పి, చదువుల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా పదో తరగతి (టెన్త్ క్లాస్) విద్యార్థులు చదువులకు హాజరుకాకుండా ఉన్న విషయాన్ని గమనించిన బి. మస్తాన్ నాయక్ , అలాంటి విద్యార్థినీ - విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి, వారి ఇళ్లకు స్వయంగా వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లల భవిష్యత్తు ఎంత ముఖ్యమో, విద్య ద్వారానే మంచి స్థాయికి చేరుకోవచ్చని వివరించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులతో కూడా వ్యక్తిగతంగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకొని, భయాలను తొలగించి, మళ్లీ ఆసక్తితో చదువుల వైపు మళ్లేలా ప్రోత్సహించారు. ఈ విధంగా విద్యార్థుల చదువు, భవిష్యత్తు పట్ల అంకితభావంతో పనిచేస్తున్న బి. మస్తాన్ నాయక్ సేవలు అభినందనీయమని స్థానికులు, ఉపాధ్యాయులు ప్రశంసిస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నమ్మకాన్ని పెంపొందించడమే కాకుండా, సమాజంలో విద్య ప్రాముఖ్యతను మరింత బలంగా చాటుతున్నాయని వారు అభిప్రాయపడుతున్నారు.

# గ్రూప్-2కు సెలెక్ట్ అయిన పోకూరు కుర్రోడు

**వలేటివారిపాలెం పెన్ పవర్, జనవరి 28:**



ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో జరిగిన గ్రూప్ 2 పరీక్ష ఫలితాలు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ ఫలితాలలో పోకూరు గ్రామానికి చెందిన దమ్ము జయసూర్య ఈ ఫలితాల ప్రభుత్వ ఎక్సైజ్ శాఖలో సబ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగం నకు ఎంపిక అయ్యారు. ఒక చిన్న గ్రామంలో జన్మించి, క్రమ శిక్షణ తో మెలుగుతూ, ఉత్తమ విద్యార్థిగా ఉంటూ, చదువును నిర్లక్ష్యం చేయకుండా, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో నిరంతరం కష్టపడి చదివి, ప్రతిష్టాత్మకమైన గ్రూప్ 2 పరీక్షలో ఉద్యోగం సాధించడం చాలా ఆనందదాయకం. జయ సూర్య తన లక్ష్యంతో పాటుగా తల్లి దండ్రుల కలను కూడా సాకారం చేయడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే జయ సూర్యకు పలు ఉద్యోగ సంఘాలు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

## జిల్లా స్థాయి అవార్డు గ్రహీతలను సన్మానించిన అంగన్వాడి కార్యకర్తలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ జనవరి 28**

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వెలిగండ్ల పరిధిలో పనిచేస్తున్న సూపర్వైజర్ కె. దేవ కృపావరం, డీఈవో సయ్యద్ రసూల్ 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం మార్కాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా స్థాయి అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి వారిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ ఆషాబేగం, బ్లాక్ కో ఆర్డినేటర్ శ్యామల, యాక్టివ్ సూపర్వైజర్ వి. సరళ, అంగన్వాడి కార్యకర్తలు రఫియా, పెద్దక్క మండలంలోని కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొదిలిలో అధికారులకు సమ్మె నోటీసులు అందించిన కార్మిక సంఘాలు



**పొదిలి, పెన్ పవర్, జనవరి 28**

ఫిబ్రవరి 12వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మె సందర్భంగా పొదిలిలోని పలు అధికారులకు కార్మిక సంఘాలు నోటీసులు అందజేశాయి. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల న్యాయమైన కోరికలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెకు పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం నాడు సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాలు ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులతోపాటు వివిధ సంఘాలకు చెందిన నాయకులకు కూడా పాల్గొన్నారు.

## పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**సి ఎస్ పురం, పెన్ పవర్ జనవరి 28**

మండల పరిధిలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 34 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఎన్టీయూ నేత బైరెడ్డి వెంగల్ రెడ్డి స్టడీ మెటీరియల్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ షరీఫ్ మరియు ఉపాధ్యాయులకు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ షరీఫ్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఇలాంటి సహాయ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. స్టడీ మెటీరియల్ అందజేసిన దాత బైరెడ్డి వెంగల్ రెడ్డిని పాఠశాల సిబ్బంది అభినందించారు. విద్యార్థులు కూడా ఈ సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# మంచి ప్రదాత చట్టం గురించి అవగాహన

**కందుకూరు పెన్ పవర్, జనవరి 28**

37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా న కందుకూరు లోని ప్రభుత్వ ప్రైవేటు వైద్యశాలల నందు మంచి ప్రదాత చట్టం(గుడ్ సమారిటన్ ల) గురించి అవగాహన కల్పిస్తు వాల్ పోస్టర్ ను అంటించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీ నాగలక్ష్మి మాట్లాడుతూ రహదారి ప్రమాదం జరిగినప్పుడు స్పాట్లో ఉన్న ప్రజల యొక్క సహాయం ఎంతో ముఖ్యమని కానీ దురదృష్టవశాత్తు ప్రతి నలుగురిలో ముగ్గురు సహాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారు దానికి కారణం వారిలో మానవత్వం లేక కాదు సహాయం అందించిన తర్వాత హాస్పిటల్ నుంచి గాని పోలీసుల నుంచి గాని తర్వాత రోజుల్లో విచారణ కారణంగా కాని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్న భయం చేత మాత్రమేనని, ఇప్పుడు అటువంటి భయం లేని పెట్టుకొని అవసరం లేదని సేవ్ లైఫ్ ఫౌండేషన్ అనే సంస్థ వారు ఓ పిల్ ద్వారా సుప్రీంకోర్టు వారికి దృష్టికి తీసుకురాగా మార్చి 30 2016ల సుప్రీంకోర్టు వారు మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్పోర్ట్ అండ్ హైవేస్ అథారిటీ వారికి రహ్ వీర్ ను అమలు చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. తద్వారా ప్రజలందరిలో అవగాహన కలిగి ప్రమాదాల బారిన పడిన వారికి తమ వంతు సహాయం



ధైర్యంగా అందించి వారి ప్రాణాలు నిలుపగలుగుతారు, అట్టివారికి ప్రభుత్వం నుండి సంపూర్ణ మద్దతు రక్షణ ఉంటుందని తెలియపరచడమే ఈ గుడ్ సమారిటన్ లా యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు, అదేవిధంగా రహదారి ప్రమాద బాధితులకు సహాయం చేసిన వ్యక్తులకు గౌరవ సూచికంగా ప్రభుత్వం వారి నుండి 25 వేల రూపాయలు



పారితోషకంగా జిల్లా కలెక్టర్ మంజూరు చేయవచ్చు, అదేవిధంగా వారి సేవలు గుర్తిస్తూ వారికి ఒక యోగ్యత పత్రం కూడా జారీ చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కందుకూరు ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా ఇంద్రాణి , కోటిరెడ్డి నర్సింగ్ హోం డాక్టర్ సాకేత్, ఆర్టీసీ ఎంఎఫ్, రవాణాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు టేబుల్ బహుకరణ

## దాత మాదినేని లక్ష్మణ్



**సి ఎస్ పురం, పెన్ పవర్ జనవరి 28**

మండల కేంద్రంలోని సి.ఎస్.పురం ఎస్టీ ప్రాథమిక పాఠశాలకు రాష్ట్ర బిజెపి ఓబీసీ కార్యవర్గ సభ్యులు మాదినేని లక్ష్మణ్ బుధవారం టేబుల్ ను పాఠశాల ప్రాంగణంలో ఎంఈఓ జె. ప్రసాదరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంటోనీ సమక్షంలో అందజేశారు ఈ సందర్భంగా ఎంఈఓ జె. ప్రసాదరావు మాట్లాడుతూ, ప్రజలు మరియు ప్రభుత్వము కలిసి భాగస్వామ్యంతో పనిచేసినప్పుడే పాఠశాలలు సమగ్రంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రభుత్వ పరంగా కల్పించే వసతులకు తోడుగా దాతల సహకారం లభిస్తే విద్యార్థులకు మెరుగైన వాతావరణం ఏర్పడుతుందని, విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతులు కల్పించడం ద్వారా వారి విద్యాభ్యాసంపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెందరో ముందుకు రావడానికి ప్రేరణనిస్తాయని అన్నారు. తదుపరి దాత మాదినేని లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి అవసరాల దృష్ట్యా టేబుల్ ను అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా పాఠశాలకు ఏ అవసరం వచ్చినా తన వంతు సహకారం అందిస్తానని, విద్యే సమాజ అభివృద్ధికి మూలాధారమని, చిన్నపిల్లల చదువుకు చేయూత నివ్వడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. అనంతరం దాత మాదినేని లక్ష్మణ్ ను పాఠశాల సిబ్బంది శాలువా తో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట శ్రీనివాసులు, పున్నమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి దేవర్ల జాతర పూజా కార్యక్రమాలలో పాల్గొన్న గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి

**ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన పొట్టి పల్లి గ్రామానికి చెందిన పెద్దలు పెద్దమ్మతల్లి ఆలయనిర్వాహకులు.**

**పెద్దమ్మ తల్లి కరుణాకటాక్షాలు గిద్దలూరు నియోజకవర్గ ప్రజలందరికీ ఎల్లవేళలా ఉండాలని ప్రార్థించిన ఎమ్మెల్యే ముత్తుముల.**

**కొమరోలు పెన్ పవర్ జనవరి 28.**

కొమరోలు మండలం పొట్టి పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి దేవర్ల జాతర తిరుణాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలకు బుధవారం గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పొట్టి పల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో పెద్దమ్మ తల్లి దేవర్ల జాతర తిరుణాల మహోత్సవం గత రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నది .ఆ వేడుకలకు హాజరు కావలసిందిగా పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ నిర్వాహకులు ,ఆ గ్రామ పెద్దలు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ని ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి బుధవారం పొట్టి గ్రామానికి వెళ్లి పెద్దమ్మతల్లి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంతకుముందు గ్రామ పెద్దలు ,పెద్దమ్మతల్లి ఆలయనిర్వాహకులు, తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు శాసనసభ్యులు ముత్తుముల అశోక రెడ్డి తదితర తెలుగుదేశం పార్టీ నేతలకు పెద్దమ్మ తల్లి కండువారివేసి మేళ తాళాలతో గంగమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఆ సందర్భంగా శాసనసభ్యులు అశోక్ రెడ్డి గంగమ్మ తల్లి పూజా కార్యక్రమాలలో పాల్గొని, గంగమ్మ తల్లి చల్లని దీవెనలు, కరుణాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని కోరుతూ ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు అందించిన తీర్థ ప్రసాదలను స్వీకరించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్ ముత్తుముల



సంజీవరెడ్డి ,కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, ఎడమ కళ్ళు సహకార సంఘం అధ్యక్షులు బిజ్జం రవీంద్రారెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, డైరెక్టర్లు షేక్ హసీనా, తిరుమల్ రెడ్డి ,గజ్జలకొండ నారాయణ ,కొమరోలు వార్డు మెంబర్ షేక్ సుభాని , పాలుగుళ్ల మల్లికార్జున్ రెడ్డి,టిడిపి యువ నాయకులు బిన్నీ భాష, కరీముల్లా, గిద్దలూరు తెలుగు దేశం పార్టీ నాయకులు బుజ్జి వెంకట్రామిరెడ్డి, అనప శేఖర్, మారి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రంగస్వామి, దాసరి హరినాథ్ తదితర నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏసీ టెక్నీషియన్స్ రాష్ట్ర ఆత్మగౌరవ సభకు ఒడా చైర్మన్‌కు ఆహ్వానం



**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ జనవరి 28**

ఫిబ్రవరి 01 న విజయవాడలో ఏసి టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న రాష్ట్ర ఆత్మగౌరవ సభ కు ముఖ్య అతిథిగా విచ్చేయ వలసినదిగా ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ (ఒడా) షేక్ రియాజ్ ను ప్రకాశం జిల్లా.. ఒంగోలు ఏసీ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఆహ్వానించారు. బుధవారం స్థానిక ఒడా కార్యాలయంలో చైర్మన్ రియాజ్ ను అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మగౌరవ సభ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఏసీ టెక్నీషియన్ ఎదుర్కొంటున్న పలు సమస్యలను రియాజ్ దృష్టికి తీసుకువెళ్లారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్లో ఏసీ టెక్నీషియన్స్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక కోటాను కేటాయించాలని ఒడా చైర్మన్ రియాజ్ వివరించారు. ఈ సందర్భంగా ఒడా చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ ఏసీ టెక్నీషియన్స్ ఎదుర్కొంటున్న సమస్యల్లో స్థానిక సమస్యలను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు, రాష్ట్ర వ్యాపిత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, జనసేన పార్టీ కార్మికులకు ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఒడా చైర్మన్ ను కలిసిన వారిలో ఒంగోలు ఏసి టెక్నీషియన్స్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా ప్రెసిడెంట్ కె. కృష్ణ, ఒంగోలు నగర అధ్యక్షులు సయ్యద్ కరిముల్లా, సెక్రటరీ బి. బాబు, ట్రెజరర్ షేక్ హర్షద్, వైస్ ప్రెసిడెంట్ శివ కుమార్, యూనియన్ గౌరవాధ్యక్షులు పఠాన్ బాజీ ఖాన్, గౌరవ సలహాదారులు సుధాకర్,శివ, మొఘల్ కాలేషా బేగ్, తదితరులు ఉన్నారు.

# పొదిలిలో రోడ్డు ప్రమాదం-వ్యక్తి దుర్మరణం



**పొదిలి, పెన్ పవర్, జనవరి 28**

పొదిలిలో బుధవారం నాడు జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందారు. పట్టణంలోని చిన్న బస్టాండు ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. పట్టణ శివారులోని బాప్టిస్ట్ పాలెం కు చెందిన అనపర్తి పెద ఎల్లమంద అనే 60 ఏళ్ల వృద్ధుడు ఉదయాన్నే టీ త్రాగేందుకు వస్తుండగా విజయవాడ నుండి కనిగిరి కి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎల్లమంద అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటనపై పొదిలి ఏ ఎస్ ఐ సత్యనారాయణ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలి

## మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి



**పొదిలి, పెన్ పవర్, జనవరి 28**

ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని మండల వ్యవసాయాధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి కోరారు. బుధవారం నాడు మండలంలోని మాదాలవారిపాలెం, ఓబులక్కపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి ఆయా గ్రామాల్లోని రైతులతో సమావేశం జరిపి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాల గురించి వివరించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించి, పంటలను సంరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను రైతులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బందితోపాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-2 ఫలితాలలో డిప్యూటీ తాసిల్దార్ పోస్ట్ కు ఎంపికైన పులిగోటి శ్రీవిద్య

గ్రూప్ 2 ఫలితాలలో మెరిసిన కొమరోలు మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు

కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న శ్రీవిద్య

డిప్యూటీ తాసిల్దారు పోస్టుకు ఎంపికైన శ్రీవిద్యను అభినందించిన తల్లిదండ్రులు, మామయ్య, కొమరోలు తాసిల్దార్ భాగ్యలక్ష్మి ,కార్యాలయ సిబ్బంది

మామయ్య రిటైర్డ్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు ప్రోత్సాహం మరువరానిది- పులిగోటి శ్రీవిద్య





**కొమరోలు పెన్ పవర్ జనవరి 28**

ఈనెల 28వ తేదీ బుధవారం విడుదలైన గ్రూప్ 2 పరీక్ష ఫలితాలలో కొమరోలు మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు మెరిసి పలు ప్రభుత్వ పోస్టులకు ఎంపికయ్యారు. కొమరోలు లోని తాసిల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తున్న పులిగోటి శ్రీవిద్య గ్రూప్ 2 ఫలితాలలో అత్యంత ప్రతిభ కనపరచి డిప్యూటీ తాసిల్దార్ పోస్ట్ కు ఎంపికయ్యారు. దీనితో శ్రీవిద్య తల్లిదండ్రులు, ప్రోత్సాహం అందించిన మామయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే. వెంకటేశ్వరరావు, బంధుమిత్రులు పలు శాఖల అధికారులు, కొమరోలు తాసిల్దార్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య, కార్యాలయ సిబ్బంది శ్రీవిద్య పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. కొమరోలు పట్టడానికి చెందిన పులిగోటి సుబ్బరాయుడు, రత్నమ్మల ఏకైక కుమార్తె శ్రీవిద్య తన ప్రాథమిక, ఉన్నత విద్యను కొమరోలు లోని సర్వైట్ హైస్కూల్లో పూర్తి చేసుకున్నారు. అనంతరం గుంటూరులోని నారాయణ కళాశాలలో ఇంటర్మీడియట్ కోర్సు పూర్తి చేశారు .ఆ తరువాత 2022లో హైదరాబాదులో బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశారు. 2023 సంవత్సరంలో హైకోర్టు విడుదల చేసిన నోటిఫికేషన్ ద్వారా పరీక్షలు రాసి జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యారు .ఆ మేరకు గిద్దలూరు లోని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ అసిస్టెంట్ పోస్టులో చేరి 2023 మే నుంచి సెప్టెంబర్ వరకు పనిచేశారు. అప్పటికే ఏపీపీఎస్సీ గ్రూప్ 4 పరీక్షలు రాసి ఉండగా 2023 జూలైలో ఫలితాలు వెలువడ్డాయి. ఆ ఫలితాలలో శ్రీవిద్య రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యారు .ఆ మేరకు కొమరోలు లోని తాసిల్దార్ కార్యాలయంలో 2023 సెప్టెంబర్ లో జూనియర్ అసిస్టెంట్గా చేరి విధులు నిర్వహిస్తున్నారు. కాగా 2024 ఫిబ్రవరిలో నిర్వహించిన గ్రూప్ 2 ప్రిలిమ్స్ పరీక్షలకు హాజరై పరీక్షలు రాశారు .2025 ఫిబ్రవరిలో నిర్వహించిన మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యారు. 2025 ఏప్రిల్ లో నిర్వహించిన కంప్యూటర్ టెస్ట్ కూడా హాజరై ప్రతిభ కనబరిచారు. కాగా గ్రూప్ 2 పరీక్ష ఫలితాలు ఈనెల 28వ తేదీన విడుదలయ్యాయి .ఆ ఫలితాలను పులిగోటి శ్రీవిద్య డిప్యూటీ తాసిల్దార్ పోస్ట్ కు ఎంపికైనట్లుగా అధికారులు ప్రకటించారు. శ్రీవిద్య డిప్యూటీ తాసిల్దార్ పోస్ట్ కు ఎంపిక కావడం పట్ల, ఆమె తల్లిదండ్రులు సుబ్బరాయుడు ,రత్నమ్మ, బంధుమిత్రులు, కొమరోలు తాసిల్దార్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య, జూనియర్ అసిస్టెంట్లు పెద్దదేవా నాయక్ ,రంగనాయకులు, కంప్యూటర్ ఆపరేటర్ ఉషారాణి ,డేటా కంప్యూటర్ ఆపరేటర్ రాజ్యలక్ష్మి, మండల సర్వేయర్ జమాల్, విఆర్వోలు ,వీఆర్ఏలు హర్షం వ్యక్తం చేస్తూ శ్రీవిద్యకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవిద్య తండ్రి పులిగోటి ప్రస్తుతం కొమరోలు మండలం బాధినేనిపల్లి లో గల మండల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. తల్లి రత్నమ్మ గతంలో కొమరోలు ప్రశాంతి స్కూలు నెలకొల్పి కరస్పాండెంట్ గా ప్రిన్సిపాల్ గా పని చేసి వందల మంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారు. కాగా తమ మామయ్య రిటైర్డ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే. వెంకటేశ్వరరావు ప్రోత్సాహం, ఆశీస్సులతోనే తాను హైకోర్టు నోటిఫికేషన్ పరీక్షలు, ఏపీపీఎస్ గ్రూప్ ఫోర్ పరీక్షలు, గ్రూప్ 2 పరీక్షలను రాయగలిగానని ,ఈరోజు డిప్యూటీ తాసిల్దార్ పోస్ట్ కు తాను ఎంపిక కావటం వెనుక తన తల్లిదండ్రుల ఆశీస్సులు, దేవుని దయతో పాటు తన మామయ్య వెంకటేశ్వరరావు ప్రోత్సాహం ఎంతో ఉన్నదని శ్రీవిద్య తనకు డిప్యూటీ తాసిల్దార్ పోస్టు లభించడం పట్ల ఆనంద భాష్పాలతో సంతోషం వ్యక్తం చేశారు. శ్రీవిద్య డిప్యూటీ తాసిల్దార్ పోస్టుకు ఎంపికై , కొమరోలు పట్టణానికి, మండలానికి మంచి పేరు ప్రఖ్యాతులు సాధించి పెట్టారని, భవిష్యత్తులో మరెన్నో పదోన్నతులు పొంది ఉన్నత స్థాయికి చేరుకోవాలని మండలంలోని పలు శాఖల అధికారులు, విద్యావేత్తలు, రాజకీయ ప్రముఖులు తదితరులు ఆకాంక్షిస్తున్నారు. కాగా కొమరోలు పట్టడానికి చెందిన మరో విద్యార్థి పులికూన గంగాధర్ గ్రూప్ టు ఫలితాలలో ఏఎస్ఓ పోస్టుకు ఎంపికయ్యారు. గంగాధర్ ప్రస్తుతం గిద్దలూరు మండలం జయరాంపురం పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే కొమరోలు మండలం కిష్టం పల్లి గ్రామానికి చెందిన పోసిన భూపాల్ రెడ్డి కుమారుడు పోసిన రంగ ప్రసాద్ రెడ్డి గ్రూప్ ఫలితాలలో విజయం సాధించారు.

# పొదిలిలో ఘనంగా స్నేహ చికెన్ ఎండి రాంరెడ్డి పుట్టినరోజు వేడుకలు





**పొదిలి, పెన్ పవర్, జనవరి 28**

పొదిలిలో స్నేహ చికెన్ ఎండి రాంరెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ భవిత పాఠశాలలో పిల్లల సమక్షంలో స్నేహ చికెన్ ఎండి రాంరెడ్డి బర్తడే కేక్ ను కట్ చేసి, పిల్లలందరికీ పంచి పెట్టారు. అలాగే అక్కడి ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు భోజన సదుపాయం కల్పించడంతోపాటు అనిల్ కుమార్ స్వయంగా పిల్లలకు వడ్డించారు. అలాగే భవిత పాఠశాలలో గల పిల్లలతో పాటు ఆయన కూడా భోజనం చేసి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే భవిత పాఠశాల పిల్లలతో అనిల్ కుమార్ ముచ్చటిస్తూ వారిని ఆనందింపజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ ఐకాన్ వరికుంట్ల నిరంజన్, గిద్దలూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినీలను అభినందించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి



**కనిగిరి ఆర్సీఇంచార్జి, పెన్ పవర్, జనవరి 28**

ఈనెల 26న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కంచర్లవారిపల్లెలో శ్రీనివాస రామానుజన్ -1729 నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీలలో పట్టణంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు నియోజకవర్గస్థాయిలో మరియు మండల స్థాయిలో గెలుపొందారు. వనమా రుచితశ్రీ నియోజకవర్గస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి నగదు బహుమతి 11000/- మరియు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. మండల స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలలో డి లోహిత, షేక్ సబియాజులహా నిలిచి నగదు బహుమతి మరియు ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి విద్యార్థినిలను అభినందించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినిలు నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగిన టాలెంట్ పరీక్షల్లో రాణించడం తమ పాఠశాలకు ఎంతో గర్వకారణం అని ఆమె ప్రశంసించారు. అలాగే ఉపాధ్యాయులు నాగ పద్మజ, లక్ష్మి, రషీదా, సాయిలక్ష్మి, గౌతమి, రమణయ్య, శ్రీనివాసులు, గోపి, ఏవి నారాయణ, సుబ్బారెడ్డి, ఆదిలక్ష్మి, పద్మలత, నాగమణి, ఉపాధ్యాయ ఉపాధ్యాయేత సిబ్బంది తదితరులు విద్యార్థినిలను అభినందించారు.

# మట్టిలో మాణిక్యం రేష్మ

గ్రూప్ 2లో మున్సిపల్ కమిషనర్ గ్రేడ్ 3గా ఎన్నిక

తల్లిదండ్రుల కష్టం, దీవెనలు, ఉపాధ్యాయుల నిర్విరామ కృషితో, తన స్వశక్తితో సాధించిన ఘనవిజయం.

ఉపాధ్యాయుల, బంధుమిత్రుల అభినందనలు అందుకున్న రేష్మ



**పామూరు, పెన్ పవర్, జనవరి 27**

కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు మహా పురుషులవుతారు అని చరిత్ర చెప్పినట్లుగా మధ్యతరగతి కుటుంబంలో తల్లితండ్రుల రెక్కల కష్టంతో, ఉపాధ్యాయుల సూచనలతో, ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ చిన్న ప్రభుత్వ ఉద్యోగంతో మొదలైన తన ప్రస్థానం గ్రూప్ 2లో మున్సిపల్ కమిషనర్ గ్రేడ్ 3గా విజయం సాధించి తన తల్లిదండ్రుల కృషిని, ఉపాధ్యాయుల సలహాలు సూచనలకు గొప్ప గుర్తింపు తెచ్చిన పామూరు పట్టణంలోని అబ్దుల్ కలాం వీధి లో నివాసముంటున్న షేక్ రేష్మ. వివరాల్లో కెళితే మధ్యతరగతి కుటుంబం తల్లి బిబి జాన్, తండ్రి ఫయాజ్ లకు ఇద్దరు సంతానం. ఒకమ్మాయి ఒక అబ్బాయి కాగా మొదటి సంతానం షేక్ రేష్మ ఆది నుంచి విద్యలో చురుకుగా సాగుతూ బీటెక్ పూర్తి చేయడం (2015-19) జరిగింది. 2019-23 వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ గా లక్ష్మీ నరసాపురంలో విధులు నిర్వహించారు. 2023 -25 వరకు పెద్దారవీడు లో జూనియర్ అసిస్టెంట్ , కంప్యూటర్ ఆపరేటర్ గా పెద్దారవీడు తహసిల్దార్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ గ్రూప్ 2కు ప్రిపేర్ అయి పరీక్షలు రాయడం జరిగింది. బుధవారం విడుదలైన గ్రూప్ 2 ఫలితాలలో మున్సిపల్ కమిషనర్ గ్రేడ్ 3గా విజయం సాధించి తన కష్టానికి తగిన ఫలితం రేష్మ సాధించడం జరిగింది. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ఆమెకు అభినందనలు శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో మరి ఎంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రేష్మ మాట్లాడుతూ తన తల్లిదండ్రుల రెక్కల కష్టం, తన గురువుల కృషితో ఈ విజయం సాధించినట్లు ఈ విజయాన్ని వారికి అంకితమిస్తున్నట్లు ఆమె తెలిపారు.

# మెప్మా ఆర్పీల నిరసన





**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 28**

గిద్దలూరు మున్సిపల్ మెప్మో కార్యాలయం దగ్గర నిరసన తెలిపిన మెప్మో ఆర్పి లు గత నాలుగు నెలల నుంచి పెండింగ్లో ఉన్న గౌర వవేతనాలు చెల్లించాలని, ప్రతినెల మొదటి వారంలో ఆర్పీలకు వారి అకౌంట్లో గౌరవవేతనం జమ చేయాలని బుధవారం గిద్దలూరు మున్సిపల్ మెప్మో కార్యాలయం దగ్గర నిరసన తెలియజేసి సీఎం ఎం ప్రసాద్ రావు కు మెప్మా ఆర్పి లు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మెప్మో ఆర్పి యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పి సాయి లక్ష్మి, డి రుతమ్మ మాట్లాడుతూ ఆర్పీలకు గత నాలుగు నెలల నుండి రావాల్సిన గౌరవ వేతనం రాకపోవడంతో ఆర్పీల యొక్క కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఆర్పీలకు రావాల్సిన నాలుగు నెలల గౌరవ వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 10వ తేదీ లోపల ఆర్పి లకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించకపోతే ఫిబ్రవరి 12 నుంచి ఆర్పి లందరూ సమ్మె చేస్తారని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆర్పీ సంఘం నాయకులు వై రాధాదేవి, విమలమ్మ, కరీమునిషా, ఎస్కే గౌసియా, భూలక్ష్మి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# మూడు రోజులు మంచినీటి సరఫరా బంద్

## - ఒంగోలు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 28**



ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని రంగారాయుడు చెరువు వద్ద రోడ్డు విస్తరణ కార్యక్రమం చేపట్టుచున్నందున, అక్కడున్న మంచినీటి పైపులైన్లను మార్చే ప్రక్రియలో భాగంగా ఫిబ్రవరి 03 నుండి 05వ తేదీ వరకు మూడు రోజుల పాటు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఒంగోలు నగర మునిసిపల్ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఒంగోలు నగరంలోని గాంధీ రోడ్డు, గానుగ పాలెం, దక్షిణం బజారు, ప్రత్తివారి వీధి, ఈమన పాలెం, జక్రయ్య నగర్, ఎన్జీవో హోమ్, సి ర్ పి క్వార్టర్స్ ఏరియా, గొడుగు పాలెం ఏరియా, రాజపానగల్ రోడ్డు ఏరియా, కేశవ స్వామి పేట, దేవుడు చెరువు, భీమరాజు వారి వీధి, కోట వీధి, వంట కాలనీ, బండ్లమిట్ట ఏరియా, లంబాడి డొంక, బాలాజిరావు పేట, గోపాల్ నగర్, కమ్మ పాలెం, తూర్పు క్రిస్టియన్ పాలెం, ఇందుర్తి నగర్, నీలాయ పాలెం, ఇస్లాం పేట, క్లౌ పేట, లారీల కుంట, కర్నూల్ రోడ్డు, శ్రీనగర్ కాలనీ 4 లైన్లు, మారుతి నగర్ 4 లైన్లు, శ్రీనివాస కాలనీ, ఆంధ్రకేసరి కాలనీ, శ్రీరామ కాలనీ, సమతా నగర్, సుజాత నగర్, రెవిన్యూ కాలనీ, వెంకటేశ్వర కాలనీ లో మంచినీటి సరఫరా లో అంతరాయం ఉంటుందని తెలిపారు. కావున పై తెలిపిన ప్రాంతములలోని ప్రజలందరూ పై విషయాన్ని గమనించి పై తెలిపిన తేదీల ముందు సరఫరా చేయు మంచినీటిని సద్వినియోగ పరచుకొని, పొదుపుగా వాడుకొని నగరపాలక సంస్థ వారికి సహకరించవలసినదిగా కమిషనర్ కోరారు.

# అజిత్ పవర్ మృతి బాధాకరం...



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 28**

మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్య మంత్రి అజిత్ పవర్ విమాన ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని గిద్దలూరు బిజెపి నాయకులు అప్పిశెట్టి ఉదయ శంకర్ విచారం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారానికి వెళుతుండగా ఆయన ఈ ప్రమాదంలో మరణించడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింన్నారు . పరిపాలనా దక్షుడు మృదుస్వభావి మంచి మనిషి పవర్ అని అలాంటి వ్యక్తి మృతి భారతీయ జనతా పార్టీకి మహారాష్ట్ర ప్రజలకు తీరని లోటని అన్నారు ఆయన మృతికి గిద్దలూరు బిజెపి పార్టీ తరపున తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని అన్నారు ఆయనకు ఆయనతోపాటు ఈ ప్రమాదంలో మృతి చెందిన వారందరి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నామన్నారు.

# ఆర్వో ప్లాంట్ కు నగదు బహూకరణ



**పొన్నలూరు పెన్ పవర్ జనవరి 28**

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంటుకు బుధవారం పూర్వ విద్యార్థి సయ్యద్ అహ్మద్ హుస్సేన్ తాను చదువుకున్న పాఠశాలకు రూ 40 వేల రూపాయలు ఆర్ ఓ ప్లాంట్ రిపేరుకు విరాళంగా అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై వెంకటేశ్వరరావు తెలిపారు. 1978 బ్యాచ్ పదవ తరగతి పూర్తి చేసుకుని పాఠశాలను గుర్తించుకుని తనవంతుగా పాఠశాలకు విరాళా మందించినట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు మాట్లా డుతూ దాతల సహాయం మరువలేనిదని వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మి వెంకటరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు బి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## తొలి ప్రయత్నంలోనే గ్రూప్-2 సాధించిన మోచర్ల యువకుడు దారా ఆమోస్

### అమ్మా,నాన్నలు ఇద్దరు బేల్దారీ కూలీలు. అభినందనలు తెలిపిన గ్రామస్తులు.

**గుడ్లూరు, పెన్ పవర్, జనవరి 28:**



మండలంలోని మోచర్ల గ్రామం ఎస్సీ కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు దారా ఆమోస్ బుధవారం విడు దలైన గ్రూప్-2 ఫలితా లలో తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించి పలువురు యువకులకు ఆదర్శంగా నిలిచాడు. మోచర్ల గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన దారా అచ్చమ్మ, దారా మాల్యాద్రి దంపతులకు జన్మించారు. తల్లిదండ్రులు ఇద్దరు బేల్దారి మేస్త్రి పనులకు వెళ్తూ కన్న కొడుకుని కష్టపడి చదివించారు. అతను కూడా 2021 నుంచి మంచి లక్ష్యంతో గ్రూప్ -2 పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడం కోసం అహర్నిశలు శ్రమించి ఉత్తమ ఫలితాలు సాధించి ఈ పరీక్షల్లో 200.1 మార్కులతో ఏ.ఎస్.ఓ (జిఏడి) ఉద్యోగం సాధించారు. తొలి ప్రయత్నంలోనే ఈ విజయం తనను వరించిందని ఆమోస్ సంతోషం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు కష్టం చేసుకుంటూ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని గ్రూప్-2 ఉద్యోగం ద్వారా సాధించగలగాని హర్షం వ్యక్తం చేశారు. గ్రూప్-2 ఉద్యోగం సాధించిన యువకుడు ఆమోస్ కు గ్రామస్తులతో పాటు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలియజేశారు.

## గ్రూప్-2లో సబ్-రిజిస్టర్ ఉద్యోగం సాధించిన పరుసు సురేష్.

### పలువురు అభినందనలు. గతంలో గ్రూప్-3, గ్రూప్-4లో ఉత్తీర్ణత.



**గుడ్లూరు, పెన్ పవర్, జనవరి 28:**

గుడ్లూరు మండలం గుండ్లపాలెం, కొత్తపేట, పరకొండపాడు పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శిగా పని చేసి, ప్రస్తుతం త్రిపురాంతకం మండలం రెవిన్యూలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్(జేఏసీఏ) గా పనిచేస్తున్న పరుసు సురేష్ బుధవారం విడుదలైన గ్రూప్-2 ఫలితాలలో జోన్-2లో టాపర్ గా నిలిచి సబ్-రిజిస్టర్ ఉద్యోగం సాధించారు. ఉద్యోగం సాధించడం పట్ల సహుద్యోగులు, మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2018లో గ్రూప్-2లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ వరకు వెళ్లి తృటిలో ఉద్యోగం కోల్పోగా, 2023లో జరిగిన గ్రూప్-2లో పాల్గొని నేటి ఫలితాలలో విజయం సాధించారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, చిన్నతనంలోని తండ్రిని కోల్పోయినప్పటికీ, తల్లి మున్సిపాలిటీలో శానిటరీ వర్కర్ గా పనిచేస్తూ చదివించింది. తల్లి కష్టాన్ని గుర్తించి పట్టుదలతో చదివి గ్రూప్-2 ఉద్యోగం సాధించి పలువురు యువకులకు ఆదర్శంగా సురేష్ నిలిచారు. గతంలో పంచాయితీరాజ్ శాఖలో పంచాయితీ కార్యదర్శి గ్రేడ్-4 ఉద్యోగం సాధించి, అనంతరం 2023లో గ్రూప్-4 పరీక్షలకు హాజరై రెవిన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్(జేఏసీఏ) ఉద్యోగం సాధించి ప్రస్తుతం గ్రూప్-2 సాధించారు. ఒకవైపు పగలు ఉద్యోగం చేసుకుంటూ, రాత్రిళ్ళు చదువుకుంటూ, అమ్మకష్టాన్ని గుర్తెరిగి, పట్టుదలతో గ్రూప్-2 ఉద్యోగం సాధించడం చాలా ఆనందంగా ఉన్నదని పరుసు సురేష్ అన్నారు.

# కటకానిపల్లె రామచంద్ర కోట గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**పెద్ద దోర్నాల పెన్ పవర్ జనవరి 28**

మండలం లోని కటాకనిపల్లి మరియు రామచంద్ర కోటక గ్రామాల లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమము ను మండల వ్యవసాయ ఆదికారి డి. జవహర్ లాల్ నాయక్ పాల్గొని గ్రామం లో సాగు చేసిన మిరప మరియు సజ్జ, మొక్కజొన్న పంటలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ పంట నమోదు ప్రతి రైతు సాగు చేసిన పంట లను గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామం లో ఉన్న అన్ని ల్యాండ్ పార్సెల్స్ ను ఈ పంట అప్ నందు నమోదు చేయడం జరుగుతుంది. అలాగే ఈ పంట చేసిన ప్రతి రైతు కి మెసేజ్ కూడా వారి యొక్క చరవాణి నెంబర్ కు వస్తుంది. రైతు కూడా ధ్రువీకరణ చేయాలి. కాబట్టి రైతులు అందరు తప్పనిసరిగా 20.02.206 తేది లోపల మీరు సాగు చేసిన పంట లను నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే భూమి ఉన్న ప్రతి రైతు కూడా రైతు అప్ ని కూడా డౌన్లోడ్ చేసుకొని వ్యవసాయ సమాచారం, మార్కెట్ ధరలు, చీడ, పీడల గురించి ఈ అప్ నందు




తెలుసుకోవచ్చని తెలిపారు. సీడ్ ప్రొడక్షన్ కొరకు సాగు చేసిన మొక్క జొన్న పంటకు కంపెనీ వారి వద్ద నుండి రైతులు తప్పనిసరిగా అగ్రిమెంట్ తీసుకోవాలని తెలిపారు. అలాగే డ్రోన్ ద్వారా పంటలపై పురుగు




మందులను, నీటిలో కరిగే ఎరువులను పిచికారీ చేసుకొని, కూలీల కొరత ను తగ్గించుకోవచ్చు ని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏపీ సి ఎఫ్ సి సిబ్బంది శ్రీనివాసరెడ్డి, వెంకట రెడ్డి, అదేయ్య, రైతులు పాల్గొన్నారు.

# భూసార పరిక్షా ఫలితాలపై అవగాహన కార్యక్రమం.






**పొన్నలూరు పెన్ పవర్ జనవరి 28**

మండలంలోని విప్పగుంట, చౌట పాలెం, ఉప్పలదిన్నె గ్రామాల్లో మండల వ్యవసాయధికారి వి రాము ఆధ్వర్యంలో ఒంగోలు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయధికారి వి.వి. శేషమ్మ భూసార పరీక్షా ఫలితాల కార్డుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించినారు. వ్యవసాధికారి వి. వి. శేషమ్మ మాట్లాడుతూ భూసార పరీక్షా ఫలితాల కార్డు నేల ఆరోగ్యం గురించి వివరించి వీటి ఆధారంగా వివిధ పంటలలో ఎరువుల యాజమాన్యం, సేంద్రియ జీవన ఎరువుల ప్రాముఖ్యత, వాటి వాడకం, పంట అవశేషాలను కాల్చడం వలన కలిగే నష్టాలు గురించి వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా రసాయనిక ఎరువులు వాడాలని, పంటలు వేసేముందు పచ్చిరోట్ట ఎరువులు జనము, జీలుగ, పిల్లిపెసర వేసుకొని పూట సమయంలో భూమిలో కలియ దున్నీకొంటే భూసారం వృద్ధి చెంది కార్బన శాతం పెరిగి నేల సారవంతం అవుతుందని తెలిపారు. మండల వ్యవసాయాధికారి వి రాము వ్యవసాయ పధకాలు, ఎ. పి. ఎఫ్. ఆర్ మొబైల్ యాప్ గురించి వివరించారు. అనంతరం నేల ఆరోగ్యం, భూసార పరీక్షా విధానం, ఫలితాల వివరణ,సమస్యత్మక భూములను బాగు చేయుట, జీవన ఎరువుల గురించిన కరదీపికలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇప్పగుంట గ్రామ కార్యదర్శి భారతి, పొన్నలూరు వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు ఉన్నశీ. కొండలరావు ఆయా గ్రామాల వి. ఎ. ఎ.లు, ఎమ్. పి. ఇ. ఒ లు, ఐ. బ్రాహ్మిని, ఎం. నాగరాజు, సుప్రజ ప్రియాంక, షేక్. నజీర్, ఏ. నాగమల్లీశ్వరరెడ్డి రైతులు పాల్గొన్నారు.

# పెద్దమ్మతల్లి దేవర ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు అన్న రాంబాబు





**కొమరోలు పెన్ పవర్ జనవరి 28**

కొమరోలు మండలం పొట్టి పల్లె గ్రామంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి దేవర ఉత్సవాలలో బుధవారం గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అన్న రాంబాబు పాల్గొని పూజలు చేశారు. పొట్టి పల్లె గ్రామంలో వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయంలో దేవర ఉత్సవాలు గత రెండు రోజులుగా ఘనంగా సాగుతున్నాయి .సదరు వేడుకలకు హాజరు కావలసిందిగా పెద్దమ్మ తల్లి ఆలయ నిర్వహకులు ,ఆ గ్రామ పెద్దలు మార్కాపురం వెళ్లి అన్నా రాంబాబు ను ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు అన్న రాంబాబు బుధవారం పొట్టి పల్లె గ్రామానికి చేరుకొని పెద్దమ్మతల్లి దేవర ఉత్సవాలలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా గ్రామం వెలుపల అన్న రాంబాబు కొమరోలు జడ్పీటిసి సభ్యులు సారే వెంకటనాయుడు, మండల వైసీపీ సీనియర్ నాయకులు నాదెల్ల వెంగయ్య చౌదరి, మండల వైసీపీ కన్వీనర్ మేరిగ రవికుమార్ ,మండల పరిషత్ ఉపాధ్యక్షులు షేక్ మౌలాలి, ఎంపీటీసీలు షేక్ సుభాని, తిరుపతి రాజు,జే.వెంకటరమణ ,జిల్లా వైసిపి ప్రచార కమిటీ సమన్వయకర్త చెదుల్ల రమణారెడ్డి, జిల్లా వైసీపీ బీసీ కమిటీ సమన్వయకర్త సారే జనార్దన్ నాయుడు జిల్లా డాక్టర్ల కమిటీ సమన్వయకర్త గోల్కొండ అబ్దుల్ సుభాన్ ,జిల్లా వైసిపి మహిళ కమిటీ సమన్వయకర్త బండారి శిరీష తదితర నేతలకు ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామ పెద్దలు ,పెద్దమ్మ తల్లి ఆలయ నిర్వహకులు పెద్దమ్మ తల్లి కండువాలతో అలంకరించి ఆలయం వరకు మేడ తాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు .ఆ సందర్భంగా అన్న రాంబాబు తదితర నేతలు పెద్దమ్మ తల్లికి పూజలు నిర్వహించారు .పెద్దమ్మతల్లి చల్లని దీవెనలు, కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని ,,ఆ తల్లి దీవెనలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, పాడిపంటలతో, సుఖసంతోషాలతో జీవించాలని అన్నా రాంబాబు ఆకాంక్షించారు. ఆ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు గుడిపాటి ప్రసాద్, తిరుమలయ్య తోపాటు అక్కపల్లి పంచాయతీలోని వైసీపీ నేతలు ,కార్యకర్తలు ,అన్న రాంబాబు అభిమానులు పాల్గొన్నారు.

# అద్దంకి మున్సిపల్ బడ్జెట్కు కౌన్సిల్ పచ్చజెండా

### రూ. 11.98 కోట్లతో 2026-27 అంచనా బడ్జెట్ ఆమోదం

### అభివృద్ధి, ప్రజోపయోగ పనులకే ప్రాధాన్యం: ఛైర్పర్సన్ లక్కెన బోయిన. ఎస్తేరమ్మ

**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 28:**

అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఛైర్పర్సన్ లక్కెన బోయిన. ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపాలిటీ సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేసింది. ఈ సమావేశంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రూపొందించిన బడ్జెట్ అంచనాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది.

**బడ్జెట్ ముఖ్యాంశాలు**

2026-27 అంచనా బడ్జెట్: రూ. 11.98 కోట్లు. “2025-26 సవరించిన బడ్జెట్: రూ. 10.84 కోట్లు” ఈ సందర్భంగా ఛైర్పర్సన్ మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ బడ్జెట్ను రూపొందించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం మెరుగుదల, ఇతర అభివృద్ధి పనులకు ఈ నిధులను వెచ్చించనున్నట్లు ఆమె వివరించారు. కౌన్సిల్ సభ్యులందరి



సమన్వయంతో అద్దంకిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, అధికారులు, కౌన్సిల్ సభ్యులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# వృథాగా పోతున్న సాగర్ నీళ్లు

### పట్టించుకోని అధికారులు



**కొనకనమిట్ల పెన్ పవర్ జనవరి 28**

తాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మరమ్మత్తులు ఉంటే వెంటనే చేయించాలని అధికారులు ఒకవైపు చెబుతున్న కింద స్థాయిలో పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని గార్లదిన్నే గ్రామ సమీపంలో గత రెండు రోజులుగా సాగర్ పైపు లైన్ ద్వారా అధిక స్థాయిలో నీరు వృథాగా పోతున్న దృశ్యం దర్శనమిచ్చింది. పైపుకు జరిగిన లీకేజీ కారణంగా విలువైన సాగర్ నీరు వృథాగా పోతుండటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సంబంధిత శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టినప్పటికీ అవి కేవలం తాత్కాలికంగానే పరిమితమయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మరమ్మతుల అనంతరం కూడా నీటి వృథా కొనసాగుతుండటంతో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గార్లదిన్నే గ్రామం మాత్రమే కాకుండా వెలుగొండ దేవస్థానం వరకు అనేక ప్రాంతాల్లో సాగర్ నీళ్లు ఇదే తరహాలో వృథాగా పోతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం పట్ల రైతులు,ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విలువైన సాగర్ నీరు ఇలా వృథా కావడం పట్ల సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి తక్షణమే శాశ్వత పరిష్కారం చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

### అతివేగమే ప్రమాదానికి కారణం?

### సంతమాగులూరు సమీపంలో విషాద ఘటన






**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 28:**

అద్దంకి నియోజకవర్గం,సంతమాగులూరు మండల పరిధిలోని నేషనల్ హైవే (నామ్ హైవే) పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వినుకొండ మండలం, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గుంటుపల్లి శ్రీనివాసరావు (40), తండ్రి అంజయ్య, బుధవారం ఉదయం తన యూనికాన్ బైక్పై వ్యక్తిగత పని నిమిత్తం బయలుదేరారు. ఏల్చూరు వైపు నుండి కొమ్మలపాడు గ్రామం వైపు వెళ్తుండగా, సైదా వలి నర్సరీ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. శ్రీనివాసరావు తన బైక్పై వెళ్తుండగా, అదే దిశలో వెళ్తున్న రాజస్థాన్ రిజిస్ట్రేషన్ కలిగిన లారీ (ఆర్ జె 11 జి.సి 5500) డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడుపుతూ బైక్ను వెనుక వైపు నుండి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు లారీ టైర్ల కింద పడిపోవడంతో తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదుమృతుడు శ్రీనివాసరావుకు భార్య సైదారాణి, కుటుంబ సభ్యులు ఉన్నారు. ప్రమాద సమాచారం అందుకున్న సంతమాగులూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. భార్య సైదారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్పై నిర్లక్ష్యం, అతివేగం కారణాలుగా కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ పట్టాభిరామయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో బ్రాహ్మణపల్లి, అంబడిపూడి గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

# వచ్చే విద్యాసంవత్సరం నుంచి బిసి వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే లా తల్లిదండ్రులు సహకరించాలి

### పదవతరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి

### ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి -వసతిగృహాల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాము







**గిద్దలూరు పెన్ పవర్ జంవవరి 28**

ప్రభుత్వ బిసి బాలుర, బాలికల , వసతిగృహాల్లో నివాస ఉంటూ 10 వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు నూరుశాతం ఉతీర్ణత సాధించి బిసి వెల్ఫేర్ కు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఎంపిడిఓ వెంకట్రామి రెడ్డి, ఎబిసిడబ్ల్యూఓ డి హరిప్రసాద్ లు కోరారు. బుధవారం అనుమల వీడు బిసి బాలుర వసతి గృహంలో జరిగిన తల్లిదండ్రుల సమావేశం లో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని , వీటిని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు . ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య ఆశాజనకంగా లేదని ఆందోళన వ్యక్తంచేశారు. వచ్చేవిద్యా సంవత్సరం నుండి వసతి గృహాల్లో విద్యార్థిని, విద్యార్థుల సంఖ్య మెరుగు పడేందుకు తల్లి దండ్రులు సహకరించాలని కోరారు. ప్రతి సంవత్సరం బేడీషీట్స్ , దుప్పట్లు , అలంకరణ సామగ్రికి నిధులు , ప్రభుత్వం నిర్ధేశించిన ప్రకారం పోషకవిలువలు కల పౌష్టికాహారం అందించటం జరుగుతుందన్నారు. దీనితో పాటు గుడ్లు , చికెన్ కూడా సరపరచేస్తామని , చిరు తిండ్ల క్రింద చిక్కి కూడా ఇస్తున్నామన్నారు. తమ పిల్లలు హాస్టల్స్ లో చదువుతున్నారని భ్రమ పడాల్సిన పనిలేదని , హాస్టల్స్ లో చదివినవారు ఎందరో ఎంతో ఉన్నత శిఖరాలు అధిరోహించారని , పేర్కొన్నారు. హాస్టల్స్ లో ఇన్నిసౌకర్యాలు గతమునేన్నడు లేవన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీటవేసి ఎన్నోసంస్కరణలు తెచ్చిందన్నారు. అందులో హాస్టల్స్ ఉన్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వ బడుల్లో శిక్షణ కలిగిన ఉపాధ్యాయులు బోధనచేస్తూ మన పిల్లల ను టతీర్చిదిద్దుతున్నారని, హాస్టల్స్ లో తల్లిదండ్రుల వలె చూసుకునే సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం సమకూర్చే సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. మన పిల్లల బంగారు భవిష్యత్ కు హాస్టల్స్ బాటలు వేస్తాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి హాస్టల్స్ లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు తల్లిదండ్రులు సహకరించాలని వారు కోరారు. ఈసమావేశంలో జెడ్పి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఫీ, ఉపాధ్యాయులు హెచ్ డబ్ల్యూ ఓ మురళి, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10 తరగతి పిల్లలకు పరీక్ష అట్టలు పంపిణీ చేశారు తల్లిదండ్రులకు భోజనం వసతి కల్పించారు. కాకుండా ఎంపిడిఓ ను , ఎబిసిడబ్లుఓ ను ఘనంగా సత్కరించారు.

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ఆశయం

### - శాసనసభ్యులు ఉగ్ర



**కనిగిరి ఆర్సీఇంచార్జి, పెన్ పవర్, జనవరి 28**

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ఆశయమని ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్ లో పామూరు మండలం ఇనిమెర్ల గ్రామానికి చెందిన సుమారు 300 కుటుంబాలు శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రజలు కోరుకున్న మంచి పాలనను అందించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయంమని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే తెలుగుదేశం పార్టీ పట్ల విశేష ఆదరణ, నమ్మకం పెరుగుతుందని అన్నారు. ఇనిమెర్ల గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. ఇనిమెర్ల గ్రామ సర్పంచ్ సిద్ధమూర్తి లక్ష్మినారాయణరెడ్డి, ఉప సర్పంచ్ బొమ్మన శ్రీనివాసులురెడ్డి, సాఫ్ట్వేర్ ఇంజినీర్ దుగ్గిరెడ్డి జీవన్ రెడ్డి, 8 మంది వార్డు సభ్యులు, వీరితో పాటు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు టీడీపీపై విశ్వాసం ప్రకటిస్తూ పార్టీలో చేరడం విశేషం. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వై.ఎస్ జగన్‌ను కలిసిన డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్

### తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గ పరిస్థితులపై చర్చ



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 28:**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డిని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త డాక్టర్. చింతలపూడి అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను అశోక్ కుమార్ అధినేతకు వివరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ కేడర్ను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని జగన్మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలపై పోరాడాలని సూచించారు. అధినేతను కలిసిన వారిలో అశోక్ కుమార్తో పాటు పలువురు పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

# శ్రీవారి సేవలో పందిటి హరీష్

### కుటుంబ సమేతంగా తిరుమలేశుని దర్శనం.

**పామూరు, పెన్ పవర్, జనవరి 28**

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారిని తెలుగుదేశం పార్టీ కనిగిరి నియోజకవర్గం వాణిజ్య విభాగ అధ్యక్షులు, జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పందిటి హరీష్ దర్శించుకున్నారు. బుధవారం తిరుమలలో తిరుమలకు వెళ్లి శ్రీవారి సేవలో తరించారు. ఈ సందర్భంగా పందిటి హరీష్ మాట్లాడుతూ శ్రీ వారి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని హరీష్ తెలిపారు.



# మహర్షిని పరామర్శించిన దద్దాల

### 25వేల ఆర్థిక సహాయం అందజేత

**పీసీపల్లి, పెన్ పవర్ జనవరి 28**



గుంటుపల్లి గ్రామానికి చెందిన బీసీ యువకుడు, ఆటో డ్రైవర్ చీమలదిన్నె మహర్షిని స్తంభానికి కట్టేసి కొట్టిన టీడీపీ వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం సాయంత్రం గుంటుపల్లి చీమలదిన్నె మహర్షిని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబందించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు . ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. 25 వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటో తగిలిందని నెపంతో బీసీ యువకుడైన మహర్షి పై గుంపులుగా విచక్షణ రహితంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇది అమానుష చర్య అని మండిపడ్డారు. ఈ ఘటన జరిగి 11 రోజులు దాటినా బాధితుడికి సరైన న్యాయం జరగలేదని, దాడికి పాల్పడిన వారిని ఇంకా శిక్షించలేదన్నారు. తూ తూ మంత్రం 3 రోజులు ఆస్పత్రిలో చికిత్స అందించి, కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక బీసీ లకు సపరేట్ బీసీ చట్టం తీసుకువస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకూ తేలేదని, ఈ రెడ్ బుక్ రాజ్యాంగం లో రాష్ట్రం లో బీసీల మీద దాడులు అధికం అయ్యాయని ఆగ్రహించారు.ఇప్పటి వరకూ బీసీ, ఎస్సీ, ఎస్టీ మంత్రులు కానీ,ఎమ్మెల్యేలు కానీ ఈ సంఘటనపై స్పందించక పోవడం దారుణమన్నారు.కూటమి ప్రభుత్వం పరిపాలనలో విఫలమైందనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం రాబోయే రోజుల్లో ప్రజలకు సరైన పాలన అందించాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన హెచ్చరించారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించుతారన్నారు. చీమలదిన్నె మహర్షికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గోపవరపు బొర్రారెడ్డి,ఓకే రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయభాస్కర్ రెడ్డి,గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి,కటికల వెంకటరత్నం,పరుచూరి రమేష్ గౌడ్,భోగాల మాలకొండారెడ్డి,చీమలదిన్నె వెంగయ్య,కాకర్ల వెంకటేశ్వర్లు,మేకల మాల్యాద్రి,భూమిరెడ్డి కొండారెడ్డి , కాంచని లక్ష్మిరెడ్డి, నియోజకవర్గం స్థాయి రజక సంఘం నాయకులు, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దద్దాల సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్సీపీలో చేరిన 20 కుటుంబాలు.





**పామూరు, పెన్ పవర్, జనవరి 28**

కనిగిరి మండలం లింగారెడ్డిపల్లి, చిన్న అలపాడు, కొత్తపల్లి గ్రామాలకు చెందిన 20 కుటుంబాలు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు సంగటి మహేంద్ర రెడ్డి, చందా నర్సారెడ్డి, మండాది కృష్ణారెడ్డి, కొండా శ్రీనివాసులు, చిలంకూరు కొండల్ రెడ్డి, శీలం శివారెడ్డి ల ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి సమక్షంలో కలిసి కనిగిరి స్థానిక వైసిపి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ వైసీపీ లో చేరారు. దద్దాల నారాయణ యాదవ్ వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్ఆర్సిపి లో ఆహ్వానించారు. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని దద్దాల భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలులో నిర్లక్ష్యమే దీనికి కారణమని వాళ్లు అన్నారు. పార్టీ లో చేరిన వారు శెట్టిపల్లి బాలకొండయ్య,శెట్టిపల్లి కొండయ్య,సంగటి వెంకటేశ్వర్ల, రేణిమడుగు నరసింహులు, పల్ల శ్రీనివాసులు, చింతం మాలకొండయ్య, నగరికంటి చెన్నయ్య, పాపా కొండయ్య, సంగటి వెంకటేశ్వర్లు, సంగటి బాబు, సంగటి కొండారెడ్డి, కుప్పనగిరి లక్ష్మీరెడ్డి పలువురు వైసిపి పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

# రవీంద్ర కి ఘన సన్మానం



కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ జనవరి 28


గ్రూప్ 2 ఫలితాలలో ఒంగోలుకు చెందిన, మద్దిరాలపాడు ప్రైమరీ స్కూల్లో పనిచేస్తున్న మోతుకూరి రవీంద్ర మునిసిపల్ కమిషనర్ గా ఎన్నిక కాబడ్డారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఒంగోలు శ్రీహర్షిణి విద్యాసంస్థలు, వారి మిత్రుల ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ , మోత్కూరి రవీంద్ర ఒక సామాన్య కుటుంబంలో జన్మించి ఎంతో కష్టపడి ఉపాధ్యాయ వృత్తి లోకి వచ్చి అంతటితో ఆగకుండా ఎంతో మందికి ఆదర్శంగా నేడు మున్సిపల్ కమిషనర్ గా ఎన్నిక కావడం చాలా సంతోషించ దగ్గ విషయం అన్నారు. రవీంద్ర నా విద్యార్థి కావటం నాకెంతో సంతోషం కలిగించిందని తెలియజేశారు. జరుగుమల్లి మండల తహసిల్దార్ పసుపులేటి మురళి మాట్లాడుతూ రవీంద్ర చాలా తెలివి కలిగిన వ్యక్తి ఎప్పుడో ఒక మంచి ఆఫీసర్ గా ఉండవలసిన వ్యక్తి లేట్ అయింది ఇప్పటికైనా ఒక మంచి ఉన్నతమైన పదవిలో నా మిత్రుడు ఉంటున్నందుకు చాలా సంతోషించదగ్గ విషయం అని తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో టంగుటూరు మండల విద్యాశాఖ అధికారి ఆనందరావు, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రెసిడెంట్ మన్నం శ్రీనివాసరావు, ఏపిటిసిఏ జిల్లా ప్రెసిడెంట్ జి. అజయ్ కుమార్, శ్రీ హర్షిణి విద్యా సంస్థలు డీన్ దారి ఆంజనేయులు, జిఎం శివరాం, మిత్ర బృందం రాంబాబు, సురేష్, భాస్కర్ ఆంజనేయులు, శ్రీహర్షిణి విద్యాసంస్థల టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొని మోతుకూరి రవీంద్ర బాబు కి అభినందనలు తెలియజేశారు.



# ఎస్పీ హర్షవర్ధన్ రాజును కలిసిన వెంకటరామరాజు

**సి ఎస్ పురం, పెన్ పవర్ జనవరి 28**


ప్రకాశం జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ వి హర్షవర్ధన్ రాజును ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం మాజీ సర్పంచి భైరవకోన దేవస్థానం మాజీ చైర్మన్ గుంటీ మడుగు వెంకట రామరాజు మర్యాదపూర్వం కలిశారు ఈ సందర్భంగా ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో వెంకట్రామరాజు మాట్లాడుతూ వచ్చే నెలలో మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పర్యాట కేంద్రమైన భైరవకోనను కుటుంబ సమేతంగాసందర్శించాలని కోరారు ఈ సందర్భంగా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ తప్పకుండా బైరవకోన వచ్చి త్రిముఖ దుర్గాంబ ను దర్శించుకుంటానని అన్నారు ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంగిశెట్టి పీరయ్య నాయుడు అంబవరం టిడిపి బూత్ ఇంచార్జి రుద్రరాజు రాజేంద్ర రాజు తదితరులు ఉన్నారు.



# వైభవంగా శ్రీ జ్వాలాముఖి అమ్మవారి అనుగ్రహ శక్తిపీఠం 19వ వార్షిక మహోత్సవాలు

## - ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు





**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు జనవరి 28**

పెళ్ళూరు గ్రామములో వేంచేసియున్న శ్రీ గురునాథేశ్వర స్వామి సమేత శ్రీ జ్వాలాముఖి అమ్మవారి అనుగ్రహ శక్తిపీఠం 19వ వార్షిక మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు బుధవారం నిర్వాహకులు ప్రసాద్ స్వామి ఆధ్వర్యంలో విశేష పూలంగి సేవ, విశేషాలంకరణ, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ గురునాథేశ్వర స్వామి సమేత శ్రీ జ్వాలాముఖి అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని వేద పురోహితుల మంత్రోచ్చారణ నడుమ కన్నుల పండుగ జరిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంగోలు ఎమ్మెల్యే



దామచర్ల జనార్ధన్ దంపతులు హాజరై జ్వాలాముఖి అమ్మవారిని దర్శించుకుని, కల్యాణోత్సవాన్ని తిలకించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు ప్రసాద్ స్వామి అమ్మవారి శేష వస్త్రాలతో ఎమ్మెల్యే దామచర్ల దంపతులను సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణోత్సవంలో భాగంగా వేద పురోహితులు కన్యాదానం, జిలకర బెల్లం, మాంగల్య పూజ, మాంగల్య ధారణ, తలంబ్రాల తంతు, విశేష హారతులు వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జ్వాలాముఖి అమ్మవారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు హాజరై అమ్మవారి అనుగ్రహానికి పాత్రులై, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## తహసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ హిమ వంశి



**పొన్నలూరు,పెన్ పవర్ జనవరి 28**

స్థానిక తహసిల్దార్ కార్యాలయాన్ని బుధవారం నాడు సబ్ కలెక్టర్ హేమ వంశి సందర్శించచారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ హిమవంశి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. కార్యాలయ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం రిజిస్ట్రేషన్ రికార్డ్ రూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వి పుల్లారావు, ఆర్ ఐ శివ, డిటి స్రవంతి, సర్వేయర్లు, వీఆర్వోలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి 8 గంటలైన నిధుల వేట, మంత్రులతో మంతనాలు ఇది గిద్దలూరు ఎమ్మెల్యే అంకితభావం





**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 29**

రాత్రి 8 గం.లు దాటినా కూడా సచివాలయంలో మినిస్టర్స్ తో గిద్దలూరు అభివృద్ధి టాపిక్ చేస్తూ నిధులు రాబట్టటం గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అంకితబావవం నియోజకవర్గ అభివృద్ధి పట్ల నిబద్ధతకు నిదర్శనం ఎక్కడ మంత్రులను కలిసిన కూడా గిద్దలూరు కి నిధులు కావాలి అని నిధులు మంజూరు చేసుకుంటూ ముందుకు పోతున్న గిద్దలూరు శాసన సభ్యులు ముత్తముల అశోక్ రెడ్డి ముందుకు సాగుతుంటారు. గిద్దలూరు లో ఉన్నట్లే ఉంటారు ఎప్పుడు అమరావతి వెళ్తారో , ఏ రాత్రతో మిస్టర్ల ను కలిసి నిధుల మంజూరు చేయించుకుని, గిద్దలూరు వచ్చి ఆనిధులకు తగ్గట్లు పునాది రాళ్లు వేసి ఆ పనులు పూర్తి అయ్యే వరకు అధికారులను పరుగు పెట్టించటం అశోకరెడ్డి నైజం ఇప్పటికే కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులను పరుగు పెట్టిస్తున్నారు. కాకుండా సి ఎమ్ సహాయనిధులు ఏడు మార్లు పంపిణీ చేసి వేల మందికి ప్రాణదానం చేసి నా ఘనత అశోకుడిదే.

## తాళ్లూరు పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు.. కలెక్టర్ ఉత్తర్వులు

**తాళ్లూరు, పెన్ పవర్ జనవరి 29**

ప్రకాశం జిల్లా తాళ్లూరు పంచాయతీ కార్యదర్శి ఐవీ. రమణారెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేసిన మహిళ షేక్ బాబ్జి పట్ల ఆయన అసభ్యకరంగా ప్రవర్తించ్చినట్లు అభియోగాలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ తాళ్లూరు మండల పరిషత్ కార్యాలయానికి కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# మంత్రి గొట్టిపాటి చొరవ తమ్మవరంలో విద్యుత్ కష్టాలకు చెక్

### *రూ. 1.32 కోట్లతో విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ పూర్తి*

### *కొత్తగా 425 స్తంభాలు, 5 ట్రాన్స్ఫార్మర్ల ఏర్పాటు...*



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 28:**

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో కొరిశపాడు మండలం, తమ్మవరం గ్రామంలో విద్యుత్ సమస్యలు పటాపంచలయ్యాయి. రూ.1.32 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ పనులు పూర్తి కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది అక్టోబర్ 18న మంత్రి గొట్టిపాటి. రవికుమార్ తమ్మవరంలో పర్యటించిన సమయంలో, దశాబ్దాల కాలం నాటి పాత విద్యుత్ లైన్లు, తరచూ తలెత్తుతున్న అంతరాయాల గురించి గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల ఇబ్బందులను గుర్తించిన మంత్రి, తక్షణమే స్పందించి ఈ.ఈ నల్లూరి. మస్తాన్ రావుకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి, పాత స్తంభాలు, తుప్పు పట్టిన లైన్లను తొలగించి, గ్రామం అంతటా కొత్తగా 425 స్తంభాలను ఏర్పాటు చేశారు. గ్రామంలో నిరంతర త్రీ-ఫేజ్ విద్యుత్ సరఫరా కోసం అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా 100 కెవిఏ సామర్థ్యం గల నాలుగు ట్రాన్స్ఫార్మర్లు, 25 కెవిఏ సామర్థ్యం గల ఒక కొత్త ట్రాన్స్ఫార్మర్ను బిగించారు. బుధవారం బీ.సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్లను విద్యుత్ శాఖ ఈ.ఈ నల్లూరి. మస్తాన్ రావు గ్రామ నేతలతో కలిసి ప్రారంభించారు.

**మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు**

తమ సమస్యను విన్న వెంటనే స్పందించి, రికార్డు స్థాయిలో పనులు పూర్తి చేయించిన మంత్రి గొట్టిపాటి. రవికుమార్ గారికి తమ్మవరం గ్రామస్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అద్దంకి డీ.ఈ.ఈ డి. దామోదరం, ఏ.ఈ ఎం. శ్రీనివాసరావు, గ్రామ టీడీపీ నేతలు కరిచేటి. రాంబాబు, తమ్మవరపు. హనుమంతరావు, రామిరెడ్డి. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అద్దంకి నియోజకవర్గానికి రూ. 8.99 కోట్లతో రెండు కొత్త సబ్‌స్టేషన్లు

### లో-వోల్టేజీ సమస్యల పరిష్కారానికి మంత్రి గొట్టిపాటి. రవికుమార్ పచ్చజెండా



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్ జనవరి 28:**

అద్దంకి నియోజకవర్గ ప్రజలకు విద్యుత్ అంతరాయాలు లేని మెరుగైన, నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలో రూ. 8.99 కోట్ల అంచనా వ్యయంతో రెండు నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్లను మంజూరు చేసినట్లు ఆయన ప్రకటించారు. ఇందులో భాగంగా అద్దంకి మండలం, పేరాయపాలెంలో రూ. 4.63 కోట్ల వ్యయంతో ఒక సబ్ స్టేషన్ నిర్మించనున్నారు. దీని ద్వారా పేరాయపాలెం, ధేనువకొండ, ఒమ్మినేనివారిపాలెం గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుంది. అలాగే జే. పంగులూరు మండలం, తూర్పు కొప్పెరపాడులో రూ. 4.36 కోట్ల వ్యయంతో మరో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. దీని ఫలితంగా తూర్పు కొప్పెరపాడు, తక్కెళ్ళపాడు, చందలూరు, నూజెళ్ళపల్లి గ్రామాల్లో లో-వోల్టేజీ సమస్యలు తొలగి, నిరంతర విద్యుత్ అందుబాటులోకి రానుంది. ప్రజల, రైతాంగ అవసరాలను గుర్తించి నూతన సబ్ స్టేషన్లను మంజూరు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అల్లినగరం, కొమరోలు హైస్కూల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు ఎస్టియు బుల్లెట్ స్టడీ మెటీరియల్ పంపిణీ.

**కొమరోలు పెన్ పవర్ జనవరి 28**

కొమరోలు మండలం అల్లినగరంలోని మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్లో, కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్టియు బుల్లెట్ ఎస్ఎస్సి స్టడీ మెటీరియల్ లను బుధవారం పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమాలలో ఎస్టీయూ ప్రతినిధులు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ను పంపిణీ చేశారు. ఆ మేరకు మార్కాపురం జిల్లా ఎస్టియు అధ్యక్షులు టీకేఎస్ ప్రసాద్, యూపీ నరసింహారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులకు, అల్లినగరం, కొమరోలు హైస్కూల్ల ప్రధానోపాధ్యాయులు మామిడి పద్మజ, కే. శివ నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. తమ




పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తూ, టెన్త్ విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేందుకు అవసరమైన స్టడీ మెటీరియల్ను పంపిణీ చేయడం అభినందినీయమని వారు పేర్కొన్నారు ఎస్టియు ప్రతినిధులు అందజేసిన స్టడీ మెటీరియల్ టెన్త్ విద్యార్థులు సద్వినియోగం చేసుకొని పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని వారు కోరారు .ఆ సందర్భంగా ఎస్టియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాంప్రసాద్, ముత్యాల మద్దిలేటి, శ్రీనివాసులు కార్యవర్గ సభ్యులు పాండురంగ స్వామి, మురళి, నాగేంద్ర తదితరులకు ప్రధానోపాధ్యాయులు మామిడి పద్మజ శివ నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com